# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 2 | సంచిక : 237 | ఎడిటర్ : వి. శ్రీనివాసరావు | పేజీలు :8 | బుధవారం 19 నవంబర్ 2025




## ఉగ్రవాదం నుంచి ప్రజలను రక్షించుకునే హక్కు భారత్‌కు ఉంది

- షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్‌లో జైశంకర్ సందేశం
- ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సహించకూడదన్న జైశంకర్
- ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించకూడదన్న జైశంకర్

2





## ఈవీఎంను ట్యాంపరింగ్ చేయడం అసాధ్యం

- ఈవీఎంలలో ముందే 25 వేల ఓట్లు..
- ఆరోపణలపై స్పందించిన ఎన్నికల సంఘం
- ఈవీఎంలలో ముందే 25 వేల ఓట్లు పడ్డాయని ఆర్జేడీ నేత ఆరోపణ
- సాంకేతికంగా అసాధ్యమని తేల్చి చెప్పిన ఎన్నికల సంఘం

2

## కమలానికి తెలుగు రాష్ట్రాల్లో..

# పట్టని చిక్కు



- ఊరంతా ఆనందం.. కానీ మన ఇంట్లో లేదు అన్నట్టు ఉంది తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ వ్యవహారం.
- కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఆ పార్టీ హవా
- ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఆ పార్టీ పరిస్థితి ఎంత మాత్రం మెరుగుపడడం లేదు
- మిత్రుల సాయంతో పర్వాలేదనిపిస్తోంది.
- కానీ సొంతంగా ఎదగాలన్న క్రమంలో చతికల పడుతోంది.
- తెలుగు రాష్ట్రాల్లో సరికొత్త చర్చ ప్రారంభం అయింది
- తెలుగు రాష్ట్రాల్లో ఇంకెప్పుడూ సంబరాలు అని ఎక్కువమంది పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారు.

**విశాఖపట్టణం**

ఊరంతా ఆనందం.. కానీ మన ఇంట్లో లేదు అన్నట్టు ఉంది తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ వ్యవహారం. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఆ పార్టీ హవా చాటుతోంది. ముఖ్యంగా ఉత్తర భారతదేశంతో పాటు ఈశాన్య రాష్ట్రాల్లో సైతం అధికారంలోకి రాగలుగుతోంది. కానీ దక్షిణ భారతదేశంలో.. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఆ పార్టీ పరిస్థితి ఎంత మాత్రం మెరుగుపడడం లేదు. మిత్రుల సాయంతో పర్వాలేదనిపిస్తోంది. కానీ సొంతంగా ఎదగాలన్న క్రమంలో చతికల పడుతోంది. బిజెపికి మాత్రమే ఎందుకు ఈ పరిస్థితి అనేది ఒక వాదన. నాయకుల మధ్య సమన్వయ లోపమే ఈ పరిస్థితికి కారణమన్నట్టు విశ్లేషణలు ఉన్నాయి. - మిగతా3లో



## నితీశ్ ప్రమాణ స్వీకారానికి చంద్రబాబు, లోకేశ్

- ఈ నెల 20న పాట్నాకు పయనం
- బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘనవిజయం
- ఎల్లుండి సీఎంగా నితీశ్ కుమార్ ప్రమాణస్వీకారం
- ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ లకు ఆహ్వానం

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ బీహార్ పర్యటనకు వెళ్లనున్నారు. బీహార్ ముఖ్యమంత్రిగా జేడీయూ అధినేత నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా వారికి ఆహ్వానం అందింది. ఈ మేరకు ఇరువురు నేతలు ఈ నెల 20వ తేదీన పాట్నాకు వెళ్లనున్నారు. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి నారా లోకేశ్ ఎన్డీఏ కూటమి తరఫున ప్రచారంలో చురుగ్గా పాల్గొన్న విషయం తెలిసిందే. ఎన్నికల సమయంలో - మిగతా3లో

## నిర్దేశించిన లక్ష్యం కంటే ముందే పూర్తికానున్న ఆపరేషన్ కగార్

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్
- ప్రశాంతంగా ఉండే జిల్లాల్లో షెల్టర్ జోన్లుగా మావోయిస్టులు మార్చుకోవడం ఆందోళన కలిగించే అంశం
- మావోయిస్టులకు షెల్టర్ ఇచ్చిన వారితోపాటు సహకారం అందిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలి



## ఏఐతో అన్ని కంపెనీలపై ప్రభావం పడుతుంది

- ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్ కీలక వ్యాఖ్యలు
- ఒకవేళ ఏఐ విస్ఫోటనం చెందితే, దాని ప్రభావం అన్ని కంపెనీలపై ఉంటుంది
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పెట్టుబడులు పెరుగుతున్నాయి



## ధాన్యం కొనుగోళ్లలో సరికొత్త రికార్డు



24 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి రూ.560 కోట్లు జమ: మంత్రి నాదెండ్ల

- రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు
- ఇప్పటివరకు 2.36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి రూ.560 కోట్లు జమ
- వాట్సాప్ ద్వారా ధాన్యం విక్రయించే సరికొత్త సౌకర్యం
- తుపాను నేపథ్యంలో రైతులకు ఉచితంగా టార్పాలిన్ల పంపిణీ



## అలా చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

- ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మహిళలకు రూ. 10 వేల చొప్పున అకౌంట్లలో వేయకపోతే జేడీయూ పార్టీకి ఖచ్చితంగా 25లోపు సీట్లు వచ్చేవి
- ఎన్నికల్లో ఇచ్చిన రూ.2 లక్షల హామీని కూటమి ప్రభుత్వం నెరవేరిస్తే తాను రాజకీయాలనుంచి శాశ్వతంగా తప్పుకుంటా
- జేడీయూ పార్టీ మహిళలలకు రూ. 2లక్షలు ఇస్తానని ఆశజూపి ప్రతి మహిళ బ్యాంకు ఖాతాలలో తొలివిడతగా రూ.10 వేలు జమచేసింది

## శబరిమలలో జనమేజనం..!

# భక్తులపై ఆంక్షలు



- ఇకపై 20 వేల మందికే స్పాట్ బుకింగ్
- ఆ సంఖ్య దాటితే.. తర్వాతి రోజు స్లాట్ కేటాయింపు
- నీలక్కల్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్
- అయ్యప్ప దర్శనానికి 6 గంటల సమయం
- కుప్పకూలి మృతిచెందిన 58 ఏళ్ల భక్తురాలు

## పుట్టపర్తికి నేడు సీఎం చంద్రబాబు..

# రేపు ప్రధాని రాక

- వారిద్దరూ శ్రీసత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలకు హాజరు
- తర్వాత అన్నదాత సుఖీభవ పథకం డబ్బు కమలాపురంలో రైతు ఖాతాల్లో జమ చేయనున్న సీఎం
- 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,135 కోట్ల జమ





**అమరావతి**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం రాత్రికి ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టపర్తికి రానున్నారు. బుధవారం ఉదయం ప్రధాని నరేంద్రమోదీ ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో పుట్టపర్తికి రానున్నారు. హైదరాబాద్ నుంచి నేరుగా మంగళవారం సాయంత్రం పుట్టపర్తికి చేరుకున్న సీఎం ఈ రాత్రికి అక్కడే బస చేయనున్నారు. బుధవారం ఉదయం 9.25 నిముషాలకు పుట్టపర్తి విమానాశ్రయంలో ప్రధాని నరేంద్ర మోదీకి ఆయన స్వాగతం పలకనున్నారు. అక్కడి నుంచి ప్రధాని మోదీతో కలిసి శ్రీసత్యసాయి బాబా శత జయంతి వేడుకలకు ముఖ్యమంత్రి హాజరు కానున్నారు. 10 గంటలకు సాయి కుల్వంత్ హాల్లో భగవాన్ శ్రీసత్యసాయి మహా సమాధిని ఇరువురు నేతలు దర్శించుకోనున్నారు. అనంతరం శ్రీసత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించే శతజయంతి ఉత్సవాలకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు హాజరు అవుతారు. ప్రధాని మోదీకి వీడ్కోలు పలికిన అనంతరం 1.15 గంటలకు కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రికి - మిగతా3లో

# అలా చేస్తే రాజకీయాలనుంచి తప్పుకుంటా



బిహార్ ఎన్నికల ఫలితాలపై జన సూరజ్ పార్టీ అధినేత విమర్శనాత్మక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మహిళలకు రూ. 10 వేల చొప్పున అకౌంట్లలో వేయకపోతే జేడీయూ పార్టీకి ఖచ్చితంగా 25లోపు సీట్లు వచ్చేయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన రూ.2 లక్షల హామీని కూటమి ప్రభుత్వం నెరవేరిస్తే తాను రాజకీయాలనుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ?ప్రశాంత్ కిషోర్ సవాల్ విసిరారు. జేడీయూ పార్టీ మహిళలలకు రూ. 2లక్షలు ఇస్తానని ఆశజూపి ప్రతి మహిళ బ్యాంకు ఖాతాలలో తొలివిడతగా రూ.10 వేలు జమచేసిందని ప్రశాంత్ కిషోర్ తెలిపారు. ఇలా ఒక్కో నియోజకవర్గానికి 10 వేల నుండి 60 వేల మంది వరకూ డబ్బులు జమచేసిందన్నారు. ఒక వేళ ఆ విధంగా చేయకుంటే తాను అంచనా వేసిన విధంగా జేడీయూకి 25 సీట్లు దాటేవి కాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.5 కోట్ల మంది మహిళలకు స్వయం ఉపాది కార్యక్రమాలకు గానూ రూ. 2 లక్షలు ఖాతాల్లో జమ చేస్తానని హామీ ఇచ్చిందని తెలిపారు ఒకవేళ ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చిన విధంగా 1.5 కోట్ల మంది మహిళలకు స్వయం ఉపాధి కార్యక్రమాలకు ఆ డబ్బులు చెల్లిస్తే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ప్రశాంత్ కిషోర్ సవాల్ విసిరారు. ఇటీవల జరిగిన బిహార్ ఎన్నికల్లో పొలిటికల్ స్ట్రాటజిస్ట్ ప్రశాంత్ కిషోర్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. ఆ ఎన్నికల్లో 200కు పైగా స్థానాల్లో పోటీ చేసినప్పటికీ కనీసం ఒక్కచోట కూడా ?జన సూరజ్ పార్టీ విజయం సాధించలేదు దీంతో ప్రశాంత్ కిషోర్ పై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాలపై ప్రశాంత్ కిషోర్ స్పందించారు. బిహార్ ఎన్నికల్లో ఓటమికి తానే పూర్తిస్థాయి బాధ్యత వహిస్తున్నానని ఎన్నికల్లో గెలవడానికి సిరీయస్‌గా కష్టపడ్డప్పటికీ ఓట్లు సాధించడంలో విఫలమయ్యామన్నారు. అందుకు గానూ తనను క్షమించాలని కోరారు. దేశవ్యాప్తంగా ఓట్లచోరీ జరుగుతుందని ఈ విషయమై జాతీయ పార్టీలంతా చర్చలు జరపాలని అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని పీకే కోరారు. ఎన్డీఏ కూటమి ఎన్నికల హామీల్లో ఇ?చ్చిన విధంగా 6 నెలల్లో మహిళల రూ. 2లక్షలు జమచేయకపోతే జన సూరజ్ పార్టీ వారి పక్షాన పోరాడుతుందని ప్రశాంత్ కిషోర్ తెలిపారు.

# శబరిమలలో జనమేజనం..! భక్తులపై ఆంక్షలు



**పథనంతిట్ట:** ముందెన్నడూ లేనివిధంగా మండల పూజ ప్రారంభం నుంచే శబరిమలకు అయ్యప్ప భక్తులు పోటెత్తారు. ఆదివారం సాయంత్రం సన్నిధానంలో అయ్యప్ప స్వామి ఆలయం తలుపులు తెరుచుకోగా.. సోమవారం రికార్డు స్థాయిలో 1.25 లక్షల మంది భక్తులు ఆ హరిహరపుత్రుడిని దర్శించుకున్నారు. నిజానికి ఆన్‌లైన్‌లో రోజుకు 70 వేల మందికి స్లాట్ బుకింగ్ అవకాశం కల్పించారు. అదనంగా 20వేల మందికి స్పాట్ బుకింగ్‌కు ఏర్పాట్లు చేశారు. అ యితే.. సోమవారం ఏకంగా 37 వేల మంది భక్తులు స్పాట్ బుకింగ్ చేసుకున్నారని, అందుకే రద్దీ విపరీతంగా పెరిగిందని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) అధికారులు చెబుతున్నారు.

**భారీ క్యూలైన్లు**

సోమవారం నుంచి నీలక్కల్, పంపాబేస్, శబరిమల సన్నిధానం కిక్కిరిసిపోయింది. ఎక్కడ చూసినా.. ఇసుకేస్తే రాలనంతగా భక్తులు కనిపిస్తున్నారు. పంపా కంట్రోల్ రూమ్ వద్ద బస్సు దిగిన భక్తులు త్రివేణీ బ్రిడ్జిని దాటడానికి అరగంట పట్టిందని, అక్కడి నుంచి పంపా గణపతి ఆలయానికి చేరుకోవడానికి గంట సమయం పట్టిందని కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్‌కు చెందిన సుందరేశ అనే భక్తుడు 'సాక్షి డిజిటల్'కి వివరించారు. ఇక శరణ్‌గుత్తి ప్రాంతంలోనూ నిమిషానికి నాలుగు అడుగులు వేసేలా రద్దీ ఉందని హైదరాబాద్‌కు చెందిన పవన్ కుమార్ గురుస్వామి వివరించారు. మారక్కూటం నుంచి 18 మెట్ల వరకు గంట సమయం.. పదునెట్టాంబడిని అధిరోహించాక.. అయ్యప్ప స్వామి దర్శనానికి మరో గంట పడుతోందని పేర్కొన్నారు. వృద్ధులు, చిన్నారులను నేరుగా ధ్వజస్తంభం నుంచి అయ్యప్ప దర్శనానికి వదులుతున్నా.. 18 మెట్లను చేరేవరకు వారికి ఇబ్బందులు తప్పడం లేదని సైదాబాద్‌కు చెందిన రవికుమార్ గురుస్వామి తెలిపారు. నీలిమలను అధిరోహించినప్పటి నుంచి భక్తులు అయ్యప్ప దర్శనం చేసుకోవడానికి 6 గంటల సమయం పడుతున్నట్లు వివరించారు.

**నీలక్కల్‌లోనే నిలిపివేత**

భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో పంపాలో స్పాట్ బుకింగ్ కౌంటర్ల సంఖ్యను 7కు పెంచినట్లు అధికారులు తెలిపారు. అయితే.. పంపా బేస్‌లో రద్దీని బట్టి ఆన్‌లైన్ బుకింగ్ లేని భక్తులను నీలక్కల్‌లో నిలిపివేస్తున్నామన్నారు. నీలక్కల్‌లో భక్తులకు వసతి సదుపాయాలున్నాయని వెల్లడించారు. అటు పంపాబేస్ నుంచి నీలిమలను అధిరోహించాక శరణ్‌గుత్తి, మారక్కూటం క్యూకాంప్లెక్సుల్లో తాగునీరు, స్నాక్స్, టీ, కాఫీ అందజేసే వెసులుబాట్లు కల్పిస్తామన్నారు. ప్రతిచోట సిబ్బందిని నియమించామన్నారు. రద్దీని అదుపుచేయడానికి ఎక్కడికక్కడ పోలీసులను మోహరించినట్లు అదనపు డీజీపీ ఎస్.శ్రీజిత్ వివరించారు. భక్తులు పరిస్థితిని అర్థం చేసుకుని, పోలీసులకు సహకరించాలని కోరారు. "సోమవారం 20 వేల మందికి స్పాట్ బుకింగ్‌కు ఏర్పాట్లు చేశాం. అయితే.. 37 వేల మంది భక్తులు వచ్చారు. అందుకే.. బుధవారం నుంచి 20 వేల స్పాట్ బుకింగ్ నిబంధనను కచ్చితంగా పాటిస్తాం. అదనంగా వచ్చే భక్తులకు తర్వాతి రోజు స్లాట్లను కేటాయిస్తాం" అని ఆయన వెల్లడించారు. ఈ సీజన్‌లో మంగళవారం మధ్యాహ్నం వరకు 1.97 లక్షల మంది భక్తులు అయ్యప్పను దర్శించుకున్నట్లు తెలిపారు.

**నీలక్కల్ వద్ద భారీగా ట్రాఫిక్**

శబరిమలకు వ్యక్తిగత వాహనాల్లో వచ్చే భక్తుల సంఖ్య పెరగడంతో.. ఎరుమేలి-పంపా, రాణి-పంపా మార్గాల్లో భారీగా ట్రాఫిక్ జామ్‌లు నెలకొంటున్నాయి. ముఖ్యంగా ప్లాపల్లి, నీలక్కల్ వద్ద వాహనాలు నత్తనడకను తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరిన్ని ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కాగా.. అప్పాచిమేడు ప్రాంతంలో ఓ భక్తురాలు కుప్పకూలి మృతిచెందారు. ఆమెను కోళిక్కోడ్ జిల్లా కోయిలాండికి చెందిన సతీ(58)గా పోలీసులు గుర్తించారు. భారీ క్యూలైన్ల కారణంగా ఆమె ఊపిరి ఆడక.. ఉక్కిరిబిక్కిరి అయ్యి.. మరణించినట్లు తెలుస్తోంది.

# 'ఇళ్లా.. ఇంద్ర భవనాలా?' కొత్త ఎమ్మెల్యేలకు పండుగే!




**పట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యేలు నూతన సర్కారు నుంచి బంపర్ బహుమతి అందుకోనున్నారు. కొత్తగా ఎన్నికైన 243 మంది ఎమ్మెల్యేల కోసం పట్నాలోని దరోగా రాయ్ పాత్‌లో నిర్మించిన 181 అధునాతన డ్యూప్లెక్స్‌ల నిర్మాణం పూర్తయ్యింది. అంతకు ముందు ఉన్న 62 బంగ్లాలకు అదనంగా నిర్మించిన ఈ నివాసాలు మొత్తం 44 ఎకరాల క్యాంపస్‌లో విస్తరించి ఉన్నాయి. ఈ నూతన భవనాలను చూసినవారంతా ఇవి 'ఇళ్లా.. ఇంద్ర భవనాలా?'అని అంటున్నారు. ప్రతి యూనిట్ సుమారు 3,693-3,700 చదరపు అడుగుల విస్తీర్ణంతో 4%దీఎఖ% ఫార్మాట్‌లో ఈ ఇళ్లను నిర్మించారు. వాటిలో విలాసవంతమైన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ప్రతి డ్యూప్లెక్స్ లేఅవుట్ ఎంతో ప్లానింగ్‌తో కనిపిస్తుంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎమ్మెల్యేలకు అవసరమైన గెస్ట్ రూమ్, పీఏ రూమ్, ఆఫీస్ రూమ్,కిచెన్ ఉన్నాయి. మొదటి అంతస్తులో మాస్టర్ బెడ్‌రూమ్‌తో సహా మూడు గదులు, మొత్తం ఆరు టాయిలెట్‌లు ఉన్నాయి. అన్ని గదులలో ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే హాస్టల్, క్యాంటీన్, కమ్యూనిటీ సెంటర్ తదితర అదనపు సౌకర్యాలను క్యాంపస్‌లో ఏర్పాటు చేశారు. ఈ కొత్త కాంప్లెక్స్ పర్యావరణ అనుకూలతలతో నిర్మితమయ్యింది. భవన నిర్మాణంలో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేశారు. వర్షపునీటి సేకరణ వ్యవస్థలను ఏర్పాటు చేయడంతో పాటు, మురుగునీటిని శుద్ధి చేసి, తోటల పెంపకానికి తిరిగి ఉపయోగించే ప్రక్రియను అమలు చేస్తున్నారు. విద్యుత్తును ఆదా చేయడానికి ఎల్ఈడీ వీధి దీపాలను వినియోగిస్తున్నారు. క్యాంపస్‌లో పచ్చదనాన్ని పెంపొందించడానికి పచ్చని చెట్లను పెద్ద ఎత్తున నాటారు. ఈ అత్యాధునిక సౌకర్యాలు, పర్యావరణ అనుకూల చర్యలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ప్రతి డ్యూప్లెక్స్‌పై దానిని కేటాయించిన ఎమ్మెల్యే పేరు, నియోజకవర్గ సంఖ్యను రాశారు. తద్వారా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ ప్రజలతో మరింత సమర్థవంతంగా కనెక్ట్ అయ్యేందుకు అవకాశం ఏర్పడుతుంది.

## ఉగ్రదాడులు.. బిర్యానీ, దావత్ వంటి కోడ్ నేమ్స్‌తో సంభాషించుకున్న వైద్యులు




ఢిల్లీ పేలుడు ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. హర్యానాలోని ఫరీదాబాద్‌లో బయటపడ్డ వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ సభ్యులను అధికారులు విచారిస్తున్నారు. వారి ఫోన్లను కూడా స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నారు. ఈ దర్యాప్తులో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. వారి చాట్స్‌లో కొన్ని కోడ్ పదాలు బయటపడ్డాయి. టెర్రర్ వైద్యులు ఎవరికీ అనుమానం రాకుండా ఉండటానికి బాంబు, దాడి కుట్రల గురించి చర్చించడానికి బిర్యానీ దావత్ వంటి పదాలను ఉపయోగించినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఉగ్రనెట్‌వర్క్‌లో కీలకంగా వ్యవహరించిన డాక్టర్ షాహిన్ సాహిద్‌ను 'మేడమ్ సర్జన్'గా పిలిచేవారని తేలింది. అంతేకాదు, అలాంటి మరికొన్ని కోడ్ నేమ్‌లు బయటకు వచ్చాయి. ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లో కమ్యూనికేషన్ కోసం ఇలాంటి పదాలను వాడినట్లు అధికారులు గుర్తించారు. బిర్యానీని పేలుడు పదార్థాలకు కోడ్ పదంగా, దావత్‌ను దాడికి కోడ్ పదంగా ఉపయోగించినట్లు సంబంధిత అధికారులు గుర్తించారు. ఢిల్లీ పేలుళ్ల వెనుక ఉన్న వైద్యులు ముజమ్మిల్ షకీల్, ఉమర్ ఉన్ నబీ, షాహీన్ సయీద్, అదీల్ రాదర్.. ఇవే కోడ్ పదాలతో దాడి గురించి చర్చించుకున్నట్లు తేలింది. 'బిర్యానీ ఈజ్ రెడీ.. తినేందుకు సిద్ధం కండి' అంటే దాడి కోసం బాంబు సిద్ధంగా ఉందని అర్థంగా అధికారులు గుర్తించారు

## ఉగ్రవాదం నుంచి ప్రజలను రక్షించుకునే హక్కు భారత్‌కు ఉంది



భారత ప్రజలను ఉగ్రవాదం నుంచి రక్షించుకునే హక్కు దేశానికి ఉందని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. రష్యాలో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్‌లో ఆయన ఉగ్రవాదానికి వ్యతిరేకంగా గట్టిగా మాట్లాడారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానిని సహించకూడదని ఆయన అన్నారు. ఉగ్రవాదం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించే ధోరణి ఉండకూడదని ఆయన తేల్చి చెప్పారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించరాదని స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం అనేది ఉమ్మడి ప్రాధాన్యంగా ఉండాలని సూచించారు. ఉగ్రవాదంపై రాజీలేని పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా జైశంకర్ రష్యాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్‌సీవో సదస్సులో పాల్గొన్నారు. అంతకుముందు రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లవ్రోవ్‌తో ఆయన సమావేశమయ్యారు. ఇరువురు ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చలు జరిపినట్లు సమాచారం.

## ఏఐతో అన్ని కంపెనీలపై ప్రభావం పడుతుంది



**లాస్ ఏంజిల్స్:** కృత్రిమ మేధ గురించి గూగుల్ సంస్థకు చెందిన ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ ఏఐ విస్ఫోటనం చెందితే, దాని ప్రభావం అన్ని కంపెనీలపై ఉంటుందన్నారు. ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పెట్టుబడులు పెరుగుతున్నాయని, ఇదో అసాధారణ సందర్భమని, ప్రస్తుతం కొనసాగుతున్న ఏఐ బూమ్‌లో హేతుబద్ధత లేదన్నారు. అన్ని కంపెనీలు ఏఐపై అతిగా ఇన్వెస్ట్ చేస్తున్నట్లు వస్తున్న వార్తలతో సిలికాన్ వ్యాలీలో కొంత ఆందోళనకరమైన అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఏఐ విస్ఫోటనాన్ని ఎదుర్కొనే రీతిలో గూగుల్ సంస్థ సిద్ధంగా ఉందా అని అడిగిన ప్రశ్నకు సుందర్ పిచాయ్ బదులిస్తూ.. ఆ తుఫాన్‌ను తమ కంపెనీ తట్టుకుటుందని, కానీ ఏదైనా సాధ్యమే అని ఆయన వార్నింగ్ ఇచ్చారు. నిజం చెప్పాలంటే ఏ కంపెనీ కూడా ప్రభావానికి లోనుకాకుండా ఉండలేదన్నారు. ఆ జాబితాలో తాము కూడా ఉంటామన్నారు. చాట్‌జీపీటీ, ఓపెన్‌ఏఐతో పోటీ ఉన్న నేపథ్యంలో ఆల్ఫాబెట్‌కు పెట్టుబడులు రెట్టింపు అయ్యాయి. ఏఐకి చెందిన సూపర్ చిప్స్‌ను ఆల్ఫా సంస్థ డెవలప్ చేస్తున్నది. ఏఐ చెప్పే విషయాన్ని గుడ్డిగా నమ్మకూడదని పిచాయ్ అన్నారు.

## ఈవీఎంను ట్యాంపరింగ్ చేయడం అసాధ్యం




బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌కు ముందే ఈవీఎంలలో 25 వేల ఓట్ల చొప్పున ఓట్లు పడ్డాయన్న ఆర్జేడీ సీనియర్ నేత జగదానంద సింగ్ ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. ఆయన ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపింది. బీహార్ తీర్పు ప్రజల అభీష్టాన్ని ప్రతిబింబించలేదని, ఈవీఎంలలో అవకతవకలు జరిగినందున న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం లేకపోలేదని ఆర్జేడీ సోమవారం పేర్కొంది. పోలింగ్ ప్రారంభానికి ముందే ప్రతి ఈవీఎంలలో 25 వేల ఓట్లు పడ్డాయని, అయినప్పటికీ తాము 25 సీట్లు సాధించామని జగదానంద సింగ్ అన్నారు. ఈ ఆరోపణలపై స్పందించిన ఎన్నికల సంఘం, ఇది సాంకేతికంగా అసాధ్యమని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియలో అనుసరించిన నిబంధనల ప్రకారం ఇవి తప్పుడు ఆరోపణలని పేర్కొంది. పోలింగ్‌కు ముందు 25 వేల ఓట్లు ఉండటం అనేది అసాధ్యమని తెలిపింది. ఈవీఎంలకు బ్లూటూత్, ఇంటర్నెట్, ఇతర కనెక్షన్లు ఏవీ ఉండవని గుర్తు చేసింది. బయటి నుంచి ఈవీఎంను యాక్సెస్ చేయడం లేదా డిజిటల్ ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమని తెలిపింది. పోలింగ్‌కు ముందు ఈవీఎంలలో ప్రతి అభ్యర్థికి సున్నా ఓట్లు కనిపిస్తాయని తెలిపింది. పార్టీల ఏజెంట్ల సమక్షంలోనే మాక్ పోలింగ్ నిర్వహిస్తారని తెలిపింది. ఆ తర్వాత మాక్ పోల్ ఓట్లను కూడా తొలగిస్తారని వెల్లడించింది. ఈవీఎంల పంపిణీ కూడా ర్యాండమ్‌గా ఉంటుందని, కాబట్టి ఏ ఓటింగ్ యంత్రం ఏ పోలింగ్ కేంద్రానికి వెళుతుందో ఎవరూ చెప్పలేరని స్పష్టం చేసింది. పోలింగ్ ప్రక్రియ ప్రతి దశలో పార్టీల ఏజెంట్లు ఉంటారని తెలిపింది. రెండు విడతల్లోనూ ఆర్జేడీ ఒక్కసారి కూడా అభ్యంతరాలు చెప్పలేదని ఎన్నికల సంఘం తెలిపింది. జగదానంద్ సింగ్ కూడా ఆధారాలను సమర్పించలేదని వెల్లడించింది. మాక్ పోల్ సర్టిఫికెట్లు, ఫామ్ 17సీ, ఇతర పత్రాలపై ఆర్జేడీ సొంత ఏజెంట్లు సంతకం చేశారని తెలిపింది. కానీ ఇప్పుడు అందుకు విరుద్ధంగా ఆరోపణలు చేస్తున్నట్లు పేర్కొంది.

# కమలానికి తెలుగు రాష్ట్రాల్లో.. పట్టని చిక్కు

-మొదటిపేజీ తరువాయి

బీహార్లో బిజెపి అతిపెద్ద పార్టీగా అవతరించడంతోపాటు ఎన్డీఏ తిరుగులేని విజయం సాధించడంతో.. తెలుగు రాష్ట్రాల్లో సరికొత్త చర్చ ప్రారంభం అయింది. తెలుగు రాష్ట్రాల్లో ఇంకెప్పుడూ సంబరాలు అని ఎక్కువమంది పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారు.ఏపీలో బిజెపి అభివృద్ధి అనేది ఇప్పట్లో జరిగే పనిలా కనిపించడం లేదు. ఎందుకంటే క్షేత్రస్థాయిలో ఆ పార్టీ బలం పెరగడం లేదు. దీనికి అనేక రకాల కారణాలు ఉన్నాయి. ఇక్కడ బలమైన రెండు ప్రాంతీయ పార్టీలు హవా చూపిస్తున్నాయి. వాస్తవానికి టిడిపి ఆవిర్భావ సమయానికి ఏపీలో బిజెపి ఎంట్రీ ఇచ్చింది. విశాఖలో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 1982లోనే బిజెపి విజయం సాధించింది. కానీ తరువాత సొంతంగా ఎదిగే ప్రయత్నం చేయలేదు. బిజెపి విధానాలు ఏపీ ప్రజల్లోకి బలంగా వెళ్లలేదు. జాతీయస్థాయిలో బిజెపి అవసరార్థం ఏపీలో ఉన్న రాజకీయ పొత్తులతో బిజెపిని గెలిపించాయే తప్పించి.. బిజెపి సొంతంగా ఎదిగిన దాఖలాలు మాత్రం ఏపీలో లేవు. 2019 ఎన్నికల్లో కనీసం ఆ పార్టీకి డిపాజిట్లు కూడా రాలేదు. 2024లో తెలుగుదేశం, జనసేనతో జతకట్టడంతో 8 ఎమ్మెల్యే సీట్లు, మూడు ఎంపీ సీట్లను గెలుచుకున్న బీజేపీ ప్రాతినిధ్యం పెంచుకుంది. 2029 ఎన్నికల్లో ఇదే పొత్తు కొనసాగితే పరవాలేదు కానీ.. పొత్తు లేకుంటే మాత్రం ఒక్క సీటు కూడా బిజెపి గెలిచే అవకాశం లేదు.ఏపీతో పోల్చుకుంటే తెలంగాణ లో బిజెపి అభివృద్ధికి చాలా రకాల అవకాశాలు వచ్చాయి. అక్కడి ప్రజలు బిజెపిని ఆదరించారు కూడా. 2014లో రాష్ట్ర విభజన జరిగింది. అప్పటినుంచి తెలంగాణలో బిజెపి అభివృద్ధి కావడం ప్రారంభం అయింది. క్రమేపీ తన ప్రాతినిధ్యాన్ని పెంచుకుంటూ వచ్చింది. అయితే 2023లో కెసిఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ పార్టీ ఓడిపోయిన నాటి నుంచి బిజెపి ఎదగడం ప్రారంభించింది. కాంగ్రెస్ అధికారంలో ఉండగా ప్రధాన ప్రతిపక్ష పాత్రను బిజెపి పోషించింది. 2024



సార్వత్రిక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీతో సమానంగా ఎనిమిది పార్లమెంట్ సీట్లను కైవసం చేసుకుంది. బిఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవలేదు. చాలా చోట్ల డిపాజిట్లు కూడా దక్కలేదు. ఇటువంటి పరిస్థితుల్లో బిఆర్ఎస్ స్థానంలో బిజెపి వచ్చి చేరిందని విశ్లేషణలు మొదలయ్యాయి. కానీ తెలంగాణ బిజెపిలో నేతల మధ్య సమన్వయ లోపంతో పార్టీ బలహీన పడింది. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కనీసం డిపాజిట్లు కూడా బిజెపికి రాలేదు. అదే సమయంలో కెసిఆర్ పార్టీ తన బలాన్ని పెంచుకుంది. రెండో స్థానంలో నిలిచింది. అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో తెలంగాణ బిజెపి విఫలం అయింది.ఏపీలో ఎదిగే ప్రయత్నం జరగడం లేదు. తెలంగాణలో ఎదిగిన తరువాత పార్టీ బలహీనం అవుతోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏపీలో పార్టీ అభివృద్ధి అనేది కూడా జరగదు. ఎందుకంటే కేంద్రంలో ఎన్డీఏ లో టిడిపి కీలక భాగస్వామిగా ఉంది. ఆ కారణం చేత ఏపీలో టిడిపిని కాదని బిజెపిని మరింత బలప రిచే పరిస్థితి కనిపించడం లేదు. తెలంగాణలో కెసిఆర్ పార్టీని కాపాడేందుకు బిజెపి తనను తాను తగ్గించుకుంది అన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనేందుకు బిఆర్ఎస్ తో బిజెపి చేతులు కలిపిందన్న మాటలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయి. బిజెపికి ఓటు వేస్తే బీఆర్ఎస్ కు వేసిన ట్టేనని ప్రజలు ఒక నిర్ణయానికి వచ్చారు. అందుకే కాంగ్రెస్ పార్టీకి జై కొట్టారు. మొత్తానికి అయితే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ ఎదగడం అన్నది ఇప్పట్లో జరిగే పని మాత్రం కాదు.

# ఏపీలోభారీగా ఉద్యోగాలు..
# జాబ్ క్యాలెండర్ రెడీ

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయనుంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలను గుర్తించి, ఊఖీఓూ పోర్టల్లో నమోదు చేస్తున్నారు. దాదాపు 99 వేల వరకు నేరుగా నియామకాలకు ఖాళీలున్నాయని అంచనా. రెవెన్యూ, ఉన్నత విద్య, పురపాలక, పంచాయతీరాజ్ వంటి శాఖల్లో వేలాది ఉద్యోగాలు భర్తీ కానున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలను గుర్తించి, వాటి వివరాలను సేకరిస్తోంది. ఈ ప్రక్రియలో భాగంగా, మంజూరైన పోస్టులు, ప్రస్తుతం ఖాళీగా ఉన్న స్థానాలు, కాంట్రాక్టు ఉద్యోగుల వివరాలను సేకరించి, ఆర్థిక శాఖ ఆధ్వర్యంలోని నిధి హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్లో నమోదు చేస్తున్నారు. కొన్ని ప్రభుత్వ విభాగాలు తమ వివరాలను ఇప్పటికే ఈ పోర్టల్లో నమోదు చేశాయి. మరికొన్ని విభాగాలు ఇంకా ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. మంజూరైన పోస్టులు, ఖాళీల వివరాలను పోర్టల్లో పొందుపరిచారు. ఈ వివరాలను ఆయా శాఖల అధిపతులు ధృవీకరించాల్సి ఉంటుంది.ఏపీ ప్రభుత్వ శాఖల్లో ప్రాథమికంగా దాదాపు 30 శాతం వరకు ఉద్యోగ ఖాళీలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఖాళీలలో కొన్నింటిలో ప్రస్తుతం కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇప్పటివరకు, 157 ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన మంజూరైన పోస్టులు, ఖాళీల వివరాలను నిర్ధారించారు. ఈ సమాచారం ఆధారంగానే ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ను రూపొందించనుంది. దాదాపు 99వేల వరకు ఖాళీలు నేరుగా నియామకాల (డీఆర్)కు వచ్చేవి ఉన్నాయి. 24 విభాగాల్లో ఖాళీలకు సంబంధించిన వివరాలపై క్లారిటీ రావాల్సి ఉంది. మరో 21 శాఖల వివరాలు నమోదు చేయడం ప్రాసెస్లో ఉంది. ఈ ప్రక్రియ పూర్తయితేనే ఖాళీల లెక్క తేలుతుందంటున్నారు. నిరుద్యోగ యువతతో నేరుగా నియామకాలకు వచ్చే వాటిని చేస్తారు.. కొన్ని పోస్టులను నిబంధనల ప్రకారం ఇన్ సర్వీసు పదోన్నతులతో నింపుతారు.రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో వేలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. రెవెన్యూ శాఖలో మొత్తం 13 వేల ఖాళీలుంటే, ఏడు హెచ్ఓడీలు 4,787 ఖాళీలను




గుర్తించారు. వీటిలో 2,552 నేరుగా నియామకాలకు కేటాయించారు. ఉన్నత విద్యా శాఖలో 7 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విశ్వవిద్యాలయాల్లో 3 వేలకు పైగా ఉన్న ఖాళీలను కోర్టు కేసుల సమస్యలు తొలగించి భర్తీ చేయడానికి చర్యలు మొదలుపెట్టారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో ఉన్న 27 వేల ఖాళీల్లో దాదాపు 23 వేల ఉద్యోగాలను నేరుగా నియామకాల ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగంలో 4 వేలకు పైగా ఖాళీలు గుర్తించగా, వాటిలో 2,600 నేరుగా నియామకాలకు వస్తాయి. వ్యవసాయ శాఖలో 3 వేలకు పైగా ఖాళీలుంటే, వాటిలో 2,400 డీఆర్ పోస్టులు. పంచాయతీరాజ్ శాఖలో నేరుగా నియామకాలకు 26 వేల వరకు పోస్టులు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. మరో మూడు వేల పోస్టులను ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్నవారికి పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తారు. మహిళ, శిశు, విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్స్ విభాగంలో 2,400 ఖాళీలున్నాయి. వీటిలో 1,820 నేరుగా నియామకాలకు కేటాయించారు. 24 ప్రభుత్వ విభాగాలు, ముఖ్యంగా పాఠశాల విద్యా శాఖ, తమ వద్ద ఉన్న మంజూరు పోస్టులు, ఖాళీల వివరాలను ఇంకా ఖరారు చేయలేదు. దీనివల్ల దాదాపు 30 వేల వరకు పాఠశాల విద్యలో బోధన, బోధనేతర ఖాళీలు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ విభాగంలో నేరుగా నియామకాలకు 10 వేల పోస్టులు సిద్ధంగా ఉన్నాయి. ఏపీఎస్పీ, ఇంటర్మీడియట్ విద్య, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్, కర్నూలు జలవనరుల ప్రాజెక్టులు, దేవాదాయ, కడప జలవనరుల శాఖ ప్రాజెక్టులు, ప్రజా గ్రంథాలయాలు, ఏపీ భవన్, ఎన్సీసీ, ప్రింటింగ్ స్టేషనరీ, స్టోర్స్ పర్చేజ్ వంటి అనేక విభాగాలు తమ వివరాలను ఆన్లైన్లో నమోదు చేయలేదు.

# అడగడుగునా అడ్డంకులు...

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయంగా అనుభవం ఉన్న నాయకుడు. అందులో ఏమాత్రం సందేహం లేదు. విజన్ ఉన్న లీడర్ కూడా. అయితే విడిపోయిన ఆంధ్రప్రదేశ్ ను ఆయన ఎంతవరకూ గట్టున పడేయగలరన్నదే ఇప్పుడు ఆ పార్టీ నేతల్లో కలుగుతున్న అనుమానం. హైదరాబాద్ వేరు. ఒక నిర్ణయం తీసుకున్నా.. అప్పటికే హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందడంతో పాటు అన్ని ప్రాంతాల ప్రజలకు అది అనుకూలమైన నివాసయోగ్య ప్రాంతంగా ఉండటం, వాతావరణం అనుకూలత ఇన్ని ప్లస్ పాయింట్ల మధ్య చంద్రబాబు సక్సెస్ సాధించి ఉండవచ్చు. కానీ అమరావతి విషయంలో సక్సెస్ సాధించడం అంత సులువు కాదన్నది వాస్తవం పొలాల్లో రాజధాని నిర్మాణాలను చేపట్టడమే ఒక సాహసోపేతమైన నిర్ణయం. రాజధాని నిర్మాణానికే ఏళ్లు పడుతుంది. భవన నిర్మాణాలకు తరచూ వచ్చే వానలు, సంభవించే పనులు వంటివి సహకరించకపోవచ్చు. ప్రకృతి కూడా రాజధాని నిర్మాణానికి అంత అనుకూలంగా ఉండదు. అదే సమయంలో ఎ నుంచి మొదలుపెట్టి ఎక్కడ వరకూ వెళ్లాలన్నదిఎవరికీ తెలియని పరిస్థితి. రాజధాని నిర్మాణం పూర్తి అంటే కేవలం నాలుగు భవనాలు నిర్మించితే సరిపోదు. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కూడా కావాలి. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం సహకరిస్తుంది కాబట్టి గుడ్డిలో మెల్ల. కానీ ఎన్ని కోట్లని అప్పులు తెచ్చి అక్కడ అభివృద్ధి చేస్తారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నఅందకుంటే ఇలా చేయండి మరో మూడేళ్లలో ఎన్నికలు... ఎందుకంటే మరో మూడేళ్లలో మళ్లీ ఎన్నికలు వస్తాయి. అప్పుడు కూటమిలో ఉన్నప్పటికీ ఈసారి రాజకీయ అవసరం బీజేపీకి వచ్చే ఎన్నికల్లో ఉండొచ్చు. ఉండకపోవచ్చు. రాజకీయ అవసరం, టీడీపీ మద్దతు అవసరమైతేనే రాజధాని నిర్మాణానికి కేంద్రం సహకరిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అదీ నిధులు ఇచ్చి కాదు.. రుణాలు తీసుకోవడంలో వెసులుబాటు మాత్రమే. కానీ వచ్చే ఎన్నికల్లో మోదీ పార్టీకి బంపర్ మెజారిటీ వచ్చి ఏపీ పార్టీల రాజకీయ అవసరం లేకపోతే మాత్రం రాజధాని కాదు కదా.. ఏపీ వైపు కూడా కేంద్ర ప్రభుత్వం చూసే అవకాశముండదు.అందుకే రాజధాని నిర్మాణం మాత్రం చంద్రబాబుకు ఒక సవాల్ అని చెప్పాలి. చెప్పినంత సులువు కాదు. ఆదేశాలు ఇచ్చినంత ఈజీ కాదు.అన్నీ సహకరించాలంటే అందుకు చాలా సమయం కావాలి. కావాల్సిన నిధులు కావాలి. మరి ఇవన్నీ దక్కాలంటే ఎన్నేళ్లన్నది మాత్రం ఎవరికీ తెలియదు.

## పుట్టపర్తికి నేడు సీఎం చంద్రబాబు.. రేపు ప్రధాని రాక

-మొదటిపేజీ తరువాయి

సీఎం చేరుకోనున్నారు. స్థానికంగా గ్రోమోర్ ఎరువుల కేంద్రాన్ని సందర్శించి అనంతరం రైతులతో సీఎం ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడే ఏర్పాటు చేసిన ప్రజావేదిక నుంచి అన్నదాత సుఖీభవ%-% పీఎం కిసాన్ రెండో విడత నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగిస్తారు. అన్నదాత సుఖీభవ%-% పీఎం కిసాన్ పథకం రెండవ విడతలో రూ.7 వేల చొప్పున 46,85,838 మంది రైతుల ఖాతాలకు రూ.3,135 కోట్లను జమ చేయనుంది. ఈ ఏడాది ఆగస్టు 2వ తేదీన మొదటి విడతగా రూ.7 వేలను ప్రభుత్వం జమ చేసింది. రేపు రెండో విడతగా మరో రూ.7 వేల చొప్పున రైతులకు ప్రభుత్వం జమ చేయనుంది. రెండు విడతల్లో మొత్తంగా రూ.6,309.44 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం రైతులకు కలుగుతోంది. ఈ కార్యక్రమం అనంతరం స్థానిక కేడర్ తో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. అనంతరం రేపు రాత్రికి అమరావతికి రానున్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో సరికొత్త రికార్డు..

రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. మంగళవారం నాటికి 32,793 మంది రైతుల నుంచి 2,36,284 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి, వారి ఖాతాల్లో రూ.560.48 కోట్లను జమ చేశామని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 30 శాతం అధికమని ఆయన వెల్లడించారు. విజయవాడ రూరల్ కానూరులోని సివిల్ సప్లైస్ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ధాన్యం కొనుగోళ్ల పురోగతిని వివరించారు. రైతులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ, నిజాయతీగా కొనుగోళ్లు జరుపుతున్నామన్నారు. క్షేత్రస్థాయిలో దాదాపు 16,000 మంది సిబ్బంది ఈ ప్రక్రియలో నిమగ్నమై ఉన్నారని, జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి 1,81,885 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు జరిగిందని, ఈసారి ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడం వల్లే కొనుగోళ్లు పెరిగాయని అన్నారు. ధాన్యం అమ్మిన వారిలో చిన్న, సన్నకారు రైతులతో పాటు 6,600 మంది కౌలు రైతులు కూడా ఉన్నారని వివరించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో డబ్బులు చెల్లిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామని మంత్రి మనోహర్ తెలిపారు. ఈ ప్రక్రియను ఒక సవాలుగా తీసుకుని, దేశంలోనే తొలిసారిగా 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని గర్వంగా చెప్పారు. గుంటూరు జిల్లాకు చెందిన పత్తిపాటి సుబ్బారావు అనే రైతు ఖాతాలో 6 గంటల్లోనే రూ.2.08 లక్షలు, ఏలూరు జిల్లా భీమడోలుకు చెందిన నీలం త్రిమూర్తులు ఖాతాలో 5 గంటల్లోనే డబ్బులు జమ చేశామని ఉదాహరణగా పేర్కొన్నారు. సాంకేతికతను వినియోగిస్తూ రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. దేశంలోనే మొదటిసారిగా వాట్సాప్ ద్వారా రైతులు తమ ధాన్యాన్ని ఏ రోజు, ఏ మిల్లుకు అమ్మాలో వారే నిర్ణయించుకునే వెసులుబాటు కల్పించామని తెలిపారు. 73373 59375 నంబర్కు 'హాయ్' అని సందేశం పంపితే, షెడ్యూల్ వివరాలు వాట్సాప్లోనే వస్తాయని, ఇప్పటివరకు 500 మంది రైతులు ఈ సేవలను వినియోగించుకున్నారని వివరించారు. రానున్న అల్పపీడన తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి మనోహర్ హామీ ఇచ్చారు. రైతు భరోసా కేంద్రాల్లో 50 వేల టార్పాలిన్లను అందుబాటులో ఉంచామని, ఇప్పటికే 19 వేల టార్పాలిన్లను ఉచితంగా పంపిణీ చేశామని తెలిపారు. గోనె సంచుల కొరత లేకుండా 6.34 కోట్ల గోతాలను సిద్ధం చేశామన్నారు. ఈ సీజన్లో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎండీ ఎస్. ఢిల్లీ రావు కూడా పాల్గొన్నారు.

## నితీశ్ ప్రమాణ స్వీకారానికి చంద్రబాబు, లోకేశ్...

-మొదటిపేజీ తరువాయి

ఆయన రాష్ట్రంలో పర్యటించి, పలు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంతేకాకుండా, తన పర్యటనలో భాగంగా పలువురు బీహార్ పారిశ్రామికవేత్తలతో సమావేశమై చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకావాలని వచ్చిన ఆహ్వానం మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ పాట్నా వెళ్లనున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. 20వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో వారు పాల్గొని నితీశ్ కుమార్కు అభినందనలు తెలియజేయనున్నారు.

## నిర్దేశించిన లక్ష్యం కంటే ముందే పూర్తికానున్న ఆపరేషన్ కగార్

**విజయవాడ :** దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన ఆపరేషన్ కగార్ నిర్దేశించుకున్న లక్ష్యాని కంటే ముందుగానే చేరుకుంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం జరిగిన ఎన్కౌంటర్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాతోపాటు పలువురు మావోయిస్టులు మరణించారు. ఈ నేపథ్యంలో ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ విజయవాడలో స్పందించారు. మావోయిస్టుల షెల్టర్ జోన్లు భగ్నం చేసే దిశగా పోలీసులు కదలడంతోపాటు విజయవాడలో మావోయిస్టుల అరెస్టులు అందుకు తార్కాణమని పేర్కొన్నారు. మావోయిస్టులు మూలాలున్న అన్ని ప్రాంతాలపై దృష్టి కేంద్రీకరించాలని పోలీసులకు ఈ సందర్భంగా ఆయన సూచించారు. ప్రశాంతంగా ఉండే జిల్లాల్లో షెల్టర్ జోన్లుగా మావోయిస్టులు మార్చుకోవడం ఆందోళన కలిగించే అంశమన్నారు. మావోయిస్టులకు షెల్టర్ ఇచ్చిన వారితోపాటు సహకారం అందిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలని పోలీసులకు ఆయన సూచించారు.

## కోటంరెడ్డి హత్య కుట్రకు.. కుట్రదారులు ఎవరు,,,,


**నెల్లూరు :** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హత్యకు రౌడీషీటర్లు ప్లాన్ చేసిన విషయం బయటపడి దాదాపు మూడు నెలలవుతుంది. అయితే తనపై ఒక రాజకీయ పార్టీకి చెందిన వారు తన హత్యకు కుట్ర చేశారని అప్పట్లో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆరోపించారు. రౌడీషీటర్ శ్రీకాంత్ కు ప్రధాన అనుచరుడైన జగదీష్ అనే వ్యక్తి సహచర మిత్రులతో మాట్లాడుతున్న వీడియో అప్పట్లో వైరల్ గా మారింది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేను చంపేస్తే డబ్బే డబ్బు అంటూ వారు మద్యం మత్తులో మాట్లాడుకుంటున్న వీడియో వైరల్ అయింది. దీంతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హత్యకు కుట్ర జరిగినట్లు తేలిందని పోలీసులు భావించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని చంపించాలనుకుంటున్నదెవరు? వారికి డబ్బులు ఇస్తామన్నది ఎవరు? అన్నది పోలీసుల విచారణ చేపట్టారు. కోటంరెడ్డి అనుచరులు మాత్రం తమ ఎమ్మెల్యే ను హత్య చేయడానికి వైసీపీ ముఖ్యనేత ఒకరు ప్లాన్ చేశారని చెబుతున్నారు.. అయితే మూడు నెలలవుతున్నా ఆ వైసీపీ ముఖ్య నేత ఎవరన్నది బయటకు రాలేదు. సింహపురి రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారిన ఈ ఘటన పై ఆ వైసీపీ నేతలు ఎవరన్నది ఇప్పటికీ తేలలేదు. కోటంరెడ్డి అనుచరులు చేసిన ఆరోపణల్లో నిజం లేదా? లేకపోతే పోలీసులు ఎందుకు ఇంతవరకూ ఆ నేతను బయటకు తీసుకురాలేకపోయారన్న ప్రశ్న వినపడుతుంది. అయితే పోలీసుల విచారణలో మాత్రం రౌడీషీటర్లు మాత్రమే స్కెచ్ వేసినట్లు తేలిందని చెబుతున్నారు.. అందకుంటే ఇలా చేయండి వైసీపీ ముఖ్య నేత అంటూ... తనను చంపేందుకు వైసీపీ నేతలు కొందరు కుట్ర చేశారన్న అనుమానాలు కలుగుతున్నాయని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మీడియాతో చెప్పారు. దీనిపై నెల్లూరు జిల్లా ఎస్పీకూడా స్పందించారు. తాము కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వీడియోను చూశామని, రౌడీ షీటర్ శ్రీకాంత్ అనుచరుడు జగదీష్ ఈ వ్యాఖ్యలు చేయడం వెనక ఎవరున్నారన్న దానిపై తాము దర్యాప్తు చేస్తామని చెప్పారు. కానీ నెలలు గడుస్తున్నా తేలకపోవడంతో వైసీపీ నేత హస్తం ఉన్నది ఉత్తదేనని తేలిపోయిందని ఫ్యాన్ పార్టీ నేతలు అంటున్నారు. కేవలం రాజకీయ లబ్ది కోసమే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి ఆ వీడియోను ఉపయోగించుకున్నారంటూ వైసీపీ నేతలు అంటున్నారు. మొత్తం మీద కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పై హత్యకు స్కెచ్ రౌడీషీటర్ల పనేనని అనుకోవాల్సి ఉంటుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# పరిపాలనా దక్షురాలు ఇందిర



ఇందిరాగాంధీ ఈ పేరు వినగానే ... తెగింపు , ధైర్యం, ఆత్మ విశ్వాసం, సాధికారిక, పట్టుదల అన్నీ గుర్తుకు వస్తాయి. ఒక మహిళ అయి ఉండి ప్రఖ్యాతి గాంచిన మహానేతలతో పోటీ పడి భారత దేశాన్ని ఏకచక్రాధి పత్యంగా పాలించ గలిగిన రాజనీతిజ్ఞులు. ఎన్ని సంక్షోబాలు ఎదురైనా, బెణుకు అనేది లేకుండా , ధైర్యసాహసాలతో ప్రధాని హొదాలో ఎన్నో కఠినమైన నిర్ణయాలు తీసుకోని పరిపాలనలో చెరగని ముద్ర వేసుకున్న సాటిలేని మేటి. ఇందిరా ప్రియదర్శిని గాంధీ (నవంబర్ 19, 1917 %–% అక్టోబర్ 31, 1984) భారత దేశపు మొట్ట మొదటి, ఏకైక మహిళా ప్రధాన మంత్రి. ఆమె భారత తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ ఏకైక కుమార్తె. జవహర్ లాల్ నెహ్రు మొదటి సారి ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ప్రధానమంత్రి సెక్రటరీగా జీతం లేకుండా పనిచేసింది. 1964 సంవత్స రములో తండ్రి మరణం తరువాత రాజ్యసభకు ఎన్నిక అయింది. లాల్ బహదుర్ శాస్త్రి మంత్రి మండలిలో ప్రసారశాఖ మంత్రిగా పని చేసింది.ఆమె 1966 నుండి 1977 వరకు వరుసగా 3 పర్యాయాలు, 1980లో 4వ పర్యాయం ప్రధాన మంత్రిగా పనిచేసింది. 1917, నవంబర్ 19 తేదీన జవహర్ లాల్ నెహ్రూ, కమలా నెహ్రూల ఏకైక సంతానంగా జన్మించింది ఇందిరాగాంధీ. తాను ఆడుకునే ప్రతీ ఆటలో బ్రిటిష్ వారిని ఎదిరింది పోరాడే ఒక దేశభక్తురాలి గానే తనను ఊహించు కుంటూ ఆడుకొనేది. 18 సంవత్సరాల వయస్సులోనే ఆమె వానర సేనను నడిపి ఉద్యమాలలో అనుభవం సంపాదించింది. ఇందిర పూణే విశ్వవిద్యాలయం నుండి మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణు రాలయింది. విశ్వభారతి విశ్వ విద్యాలయంలో చదివింది. ఇంగ్లండు నందలి ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయం లోని సోమర్ విల్ కళాశాలలో చదివేటప్పుడు, స్వాతంత్ర్యం సంపాదించడంకోసం లండనులో స్థాపించ బడిన ఇండియాలీగ్ లో, 1930 లో చేరింది. 1936లో తల్లి కమలా నెహ్రూను కోల్పోయింది. 1938 లో భారత జాతీయ కాంగ్రెస్ లో చేరింది. జర్నలిస్ట్ ఫిరోజ్ తో పరిచయము క్రమంగా పరిణ యానికి దారి తీసింది. నెహ్రు కాశ్మీరీ బ్రాహ్మణులు కావటం, ఫిరోజ్ పూర్వీకులు పర్షియా నుండి భారత దేశానికి వలస వచ్చి స్థిరపడిన పార్సీలు కావటంతో పెళ్లి చేయటానికి ఆ సమయంలో నెహ్రు ఒప్పుకోలేదు, ఆ తర్వాత నెహ్రూను మహాత్మా గాంధీ ఒప్పించడంతో, 1942–03–26న ఇందిరా (25), ఫిరోజ్ (29)ల పెళ్లి చేసారు.1942లో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో జైలుకు వెళ్ళి 1943 మే 13 న విడుదలైంది. జైలులో ఉండగానే ఆమె ఒక మగ పిల్ల వాడికి తల్లి కాగా, ఆ బాలునికి రాజీవ్ అని పేరు పెట్టారు. రాజీవ్ గాంధీకి రెండు సంవత్సరాల వయసు ఉన్నప్పుడు, వారు లక్నో వెళ్లగా, అక్కడ నేషనల్ హెరాల్డు పత్రికా సంపాదకునిగా ఫిరోజ్ గాంధీ పనిచేసిన సమయంలో సంజయ్ గాంధీ జన్మించాడు. భర్తతో కలిసి అలహాబాదులో ఉంటున్న సమయంలో విభేదాలు రావడంతో అలహాబాదును వదలి ఢిల్లీ చేరి ఆమె తండ్రితో జీవించింది. 1951లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికలలో జవహర్ లాల్ నెహ్రూకు పోటీగా ఫిరోజ్ గాంధీ రాయ్‌బరేలీ నియోజక వర్గంలో పోటీ చేసినప్పుడూ ఇందిర తండ్రి తరఫున ప్రచారం చేసి , ఆ ఎన్నికల్లో తండ్రిని గెలిపించింది. ఖంగుమని మోగే కంఠస్వరం, సామాన్యులలో కలసిపోయే ఆమె స్వభావం ప్రజలను ఆకర్షించేవి. 1959 ఫిబ్రవరి 2 న భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఆమెను ఎన్నుకున్నారు. 1960 సెప్టెంబర్ 8న ఫిరోజ్ గాంధీ మరణించాడు. 1964 మే 27న జవహర్ లాల్ నెహ్రూ మరణిం చడంతో ఇందిర జీవితంలో పెనువిషాదం ఏర్పడింది. తండ్రి మరణానంతరం ఇందిర రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికై లాల్ బహదూర్ శాస్త్రి మంత్రివర్గంలో కేబినెట్ హొదా కలిగిన సమాచార, ప్రసార శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టింది.1966 జనవరి 24న ఇందిర మొదటి సారిగా ప్రధానమంత్రి బాధ్యతలను స్వీకరించి దేశ మొట్ట మొదటి మహిళా ప్రధానమంత్రిగా సంచలనం సృష్టించింది. నేటివరకు కూడా మరో మహిళ ఆ స్థానాన్ని చేపట్టలేని రికార్డు అది. ఇందిర 1966 నుండి 1977 వరకు వరుసగా 3 పర్యాయాలు, 1980లో 4వ పర్యాయం ప్రధానమంత్రిగా పనిచేసింది. 1975–06–26 భారత ప్రధాని ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.1977–03–22 ఇందిరా గాంధీ భారత ప్రధాని పదవికి రాజీనామా చేశారు. 1977లో అత్యవసర పరిస్థితిని ఉపసంహరించి ఎన్నికలను ప్రకటించింది. అత్యవసర పరిస్థితి పరిణామం 1977 ఎన్నికలలో ఓటమి రూపంలో బయట పడింది. ఇందిర సొంత నియోజకవర్గ మైన రాయ్ బరేలీలో కూడా జనతా పార్టీకి చెందిన రాజ్ నారాయణ్ చేతిలో ఓడిపోయింది. 1977–10–03 ఇందిరా గాంధీని అరెస్టు చేశారు. ఇది జాతీయ అసంతృప్తి, దేశ వ్యాప్తంగా నిరసనలకు దారి తీసింది. 1978లో ఇందిరా కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేసి ఉప ఎన్నికలలో విజయం సాధించి లోక సభలో మళ్ళీ అడుగు పెట్టింది. 1980–01–06 ఎన్నికలలో ఇందిరా గాంధీ కాంగ్రెస్ మధ్యంతర ఎన్నికలలో భారీ విజయం సాధించి మరో సారి ప్రధాన మంత్రి బాధ్యతలను చేపట్టింది. ఈసారి విశేషం ....ఆమె స్వయంగా ఆంధ్ర ప్రదేశ్ లోని మెదక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి భారీ ఆధిక్యతతో గెలుపొందింది. రాజభరణాల రద్దు, 1966లో రూపాయి మూల్య న్యూనీకరణ, 1969లో బ్యాంకుల జాతీయా కరణ, బంగ్లా శరణాగతుల పునరావాసం లాంటి నిర్ణయాలతో పాటు దేశంలో పంటల ఉత్పత్తిని పెంచడానికి హరిత విప్లవం, పేదరిక నిర్మూలనకై గరీబీ హటావో నినాదం, 20 సూత్రాల పథకము లాంటి ప్రజాకర్షక పథకాలు చేపట్టింది. ఆమె 1984 –06–05 ఇందిరా గాంధీ సిక్కు పవిత్ర స్థలమైన అమృత్సర్‌లోని స్వర్ణ దేవాలయం పై ఆపరేషన్ బ్లూ స్టార్ దాడి చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే 1984–10–31 భారత ప్రధాన మంత్రి ఇందిరా గాంధీని ఆమె అంగరక్షకులు సత్వంత్ సింగ్, బిఆంత్ సింగ్ లు న్యూ ఢిల్లీలోని ప్రధాని అధికార నివాసంలో కాల్చి హత్య చేశారు. 1984–11–03 ఇందిరా గాంధీ మృతదేహాన్ని దహనం చేశారు.

# సమర యోధురాలు ఝాన్సీ



ఆధునిక భారతదేశ చరిత్రలో బ్రిటిష్ వలస పాలన, విధానాలకు వ్యతిరేకంగా జరిగిన గొప్ప చారిత్రక సంఘటనే '1857 సిపాయిల తిరుగుబాటు'. బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీ... బెంగాలు నవాబు, ఆయన ఫ్రెంచి మిత్రుల కూటమికి 1757 జూన్ 23న ప్లాసీ నిర్ణయాత్మక యుద్ధం జరగగా, తర్వాత వందేళ్లకు ఈ తిరుగు బాటు చోటు చేసుకుంది. దీనినే 'ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం', 'సిపాయిల పితూరి', 'విప్లవోద్యమం'గా చరిత్రకారులు అభివర్ణించారు. వీరసావర్కర్ తాను రచించిన గ్రంథం ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ లో సిపాయిల తిరుగుబాటు ప్రథమ స్వాతంత్ర్య సమరమని పేర్కొనడం జరిగింది. ఉత్తర, మధ్య భారత దేశంలో బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధం వైఫల్యంతో ముగిసింది.1857 మే 10న మీరట్లోని బెంగాల్ అశ్విక దళంలో కొందరు సైనికులు ఢిల్లీ వైపు రావడంతో ప్రారంభమైన తిరుగుబాటు, వేగంగా ఉత్తర భారతం మొత్తానికి విస్తరించింది. మీరట్, ఝాన్సీ, కాన్పూర్, లక్నోలు తిరుగుబాటు తలెత్తిన ముఖ్య ప్రాంతాలు.ఉత్తర భారత దేశ రాజ్యమైన ఝాన్సీ అనే రాజ్యానికి రాణి. 1857లో ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించింది. భారత దేశంలోని బ్రిటిష్ పరిపాలనలో ఝాన్సీ కీ రాణి గ ప్రసిద్ధికెక్కినది.1857 లో భారత దేశ తిరుగుబాటు దార్లలో ముఖ్యమైన వాళ్ళలో ఆమె ముఖ్యమైనది. ఝాన్సీ లక్ష్మీబాయి అసలు పేరు మణికర్ణిక. ఆమె 1828వ సంవత్సరం నవంబరు19 న మహారాష్ట్ర కు చెందిన సతారలో ఒక కర్హాడీ బ్రాహ్మణుల వంశంలో వారణాసిలో విక్రమ నామ సంవత్సరం బహుళ పంచమీ నాడు జన్మించింది. లక్ష్మీబాయికి 13 ఏళ్ళ వయసు లోనే 1842లో ఝాన్సీ పట్టణానికి రాజైన గంగాధరరావు నెవల్కార్ తో వివాహమైంది. దీంతో ఆమె ఝాన్సీ పట్టణానికి మహారాణి అయింది. అప్పటి ఆచారాల ప్రకారం మహారాణి అయిన తర్వాత ఆమె పేరు లక్ష్మీబాయి అయింది. 1851లో లక్ష్మీబాయికి ఒక కుమారుడు జన్మించాడు. అయితే ఆ పిల్లవాడు నాలుగు నెలల వయసులోనే కన్ను మూశాడు. 1853 లో గంగాధర రావుకు అనారోగ్యం సోకింది. వేరే బిడ్డను ఎవరినైనా దత్తత తీసుకోమని అందరూ సలహ ఇచ్చారు. దాంతో ఆయనకు దూరపు బందువైన వాసుదేవ నేవల్కర్ కుమారుడైన దామోదర్ రావు అనే పిల్లవాడిని చని పోవడానికి కేవలం ఒక్క రోజు ముందుగానే దత్తత తీసుకున్నారు. 1853, నవంబర్ 21 వ తేదీన గంగాధరరావు మరణించాడు. హిందూ సాంప్రదాయం ప్రకారం దామోదర్ రావు రాజ్యానికి వారసుడు కావల్సి ఉన్నా బ్రిటీష్ ప్రభుత్వం అందుకు అంగీకరించ లేదు. దామోదర్ రావు రాజా కు రక్త సంబంధం కానందు వలన అంటే దత్త సంబంధం కావున, ఈస్ట్ ఇండియా కంపనీ గవర్నర్ జనరల్ లార్డ్ డల్ హౌసి, సిద్ధాంతం ప్రకారం రావు సింహాసనాన్ని అధిష్టించే అధికారం లేదని అతనిని నిరాకరించాడు. రాణి ఝాన్సీని ఇవ్వకూడదని నిశ్చయించు కొన్నది. ఆమె తన సైన్యాన్ని బలపర్చి, తమకు తాముగా వచ్చిన వాళ్ళను పోగుచేసి ఒక సేనను తయారు చేసింది. మహిళలకు కూడా యుద్ధ శిక్షణ ఇవ్వబడింది. యుద్ధ వీరులైన గులాం గాస్ ఖాన్, దోస్త్ ఖాన్, ఖుదా బక్ష్, లాల భు బక్షి, మోతీ బాయి, సుందర్ – ముందర్, ఖాసి బాయి, దీవాన్ రఘునాథ్ సింగ్, దీవాన్ జవహర్ సింగ్ రాణి బలగంలో ఉన్నారు. అలా జరిగిన యుద్ధంలో లక్ష్మిబాయి 1858 జూన్ 17 న గ్వాలియర్ లో యుద్ధ సమయములో మరణించింది. గ్వాలియర్ యుద్ధం గురించి జనరల్ రోస్ ప్రస్తావిస్తూ విప్లవ కారుల్లోకెల్లా ఆమే అత్యంత ధైర్య సాహసాలతో పోరు సల్పిందని కితాబిచ్చాడు. ఆమెకున్న ధైర్యము, పరాక్రమము, వివేకము, భారత దేశంలో 19 వ శతాబ్దములో మహిళలకున్న అధికారం పై ఆమెకున్న ముందుచూపు, ఆమె చేసిన త్యాగాలు ఆమెను స్వాతంత్ర్య పోరాటంలో ఒక ప్రసిద్ధ వ్యక్తిగా నిలిపింది. "జోన్ ఆఫ్ ఆర్క్" లాగా ఆమె భారత దేశ చరిత్రలో ఒక గొప్ప వ్యక్తిగా నిలిచిపోయింది.

## చలి.. జనజీవనం అస్తవ్యస్తం!

తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యంగా ఉత్తర ప్రాంతంలోని ఆదిలా బాద్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలపై చలి పంజా విసురుతోంది. గత పది రోజులుగా ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోయి, గ్రామీణ, గిరిజన వర్గాలను గజగజ వణికిస్తున్నాయి. డిసెంబర్ ప్రవేశించక ముందే ఈ తీవ్రత ప్రజలను బెంబేలెత్తిస్తోంది. పగటిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గడంతో జన జీవనం పూర్తిగా స్తంభించింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల నుంచి వీస్తున్న చల్లని గాలుల దాడికి ఈ ప్రాంతం అతలాకుతలమవుతోంది. వాతావరణంలో ఈ అసాధారణ మార్పు దీర్ఘకాలిక ప్రజారోగ్య, ఆర్థిక సమస్యలకు సంకేతంగా నిలుస్తోంది. ఆకస్మిక చలితీవ్రతకు సిద్ధంగా లేని ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు, నిరాశ్రయుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఈ చలిగాలులు సాధారణ జీవితాన్ని ప్రభావితం చేయడమే కాకుండా, రైతులు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి. చలి తీవ్రత పెరుగుతున్న కొద్దీ, ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులలో పాటు శ్వాసకోశ వ్యాధుల బాధితులు అధికంగా ప్రభావితమవుతున్నారు. జలుబు, దగ్గు, ఆయాసం, న్యుమోనియా వంటి శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో ఆసు పత్రులు కిటకిటలాడుతున్నాయి. అధిక చలి కారణంగా రక్త నాళాలు సంకోచించి రక్తపోటు పెరిగి, గుండెపై భారం పడుతుంది. ఫలితంగా, ఇటీవల గుండెపోటు కేసులు పెరగడం, హృద్రోగులలో సమస్యలు తలెత్తడంతో ప్రజలలో మరింత ఆందోళన కలిగిస్తోంది. చలికాలంలో అత్యంత ఎక్కువ ఇబ్బందులు పడుతున్న వర్గం ప్రభుత్వ వసతి గృహాలు (హాస్టల్స్), గురుకులాల్లోని విద్యార్థులు.. సంగారెడ్డి, సూర్యాపేట వంటి జిల్లాల్లోని సంక్షేమ హాస్టళ్లలో వేడినీటి యంత్రాలు పనిచేయకపోవడం, పూర్తి స్థాయిలో దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కోదాడ, సూర్యాపేటలోని ఎస్సీ బాలుర హాస్టల్స్‌లో కిటికీలు, తలుపులు లేకపోవడంతో విద్యార్థులు చల్లని గాలులకు వణుకుతూ నేలపైనే నిద్రిస్తున్నారు. జహీరాబాద్ ఎస్సీ బాలికల వసతి గృహం వంటి శిథిలావస్థ భవనాల్లో సరిపడా మంచాలు లేకపోవడంతో నేలపై కునుకు తీయక తప్పడం లేదు. కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వ వ్యవస్థల విధి నిర్వహణలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. విపరీతమైన చలి వ్యవసాయ రంగంపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది. ప్రస్తుతం యాసంగి పంటకు రైతులు సిద్ధమవుతున్న తరుణంలో, ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల వరి నారు ఎదుగుదల మందగిస్తోంది. నారుమళ్లు ఆశించినంతగా పెరగకపోవడంతో నారు నాటు ఆలస్యం అవుతోంది. ఉదయం కురుస్తున్న మంచు, పత్తి వంటి పంటల నాణ్యతను దెబ్బతీసి, రైతుల దిగుబడిపై, ఆదాయంపై ప్రభావం చూపుతోంది. ఇక కూరగాయల పంటలకు సైతం కాత, పూత తగ్గి దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. ఈ తీవ్రమైన పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. ప్రభుత్వ యంత్రాంగం నిద్ర వీడి వేగం పెంచాలి.

## అక్రమ మైనింగ్ లో పూర్తిగా సిద్దలు కోన దేవాలయ భూములు

నెల్లూరు జిల్లా, ప్రతినిధి శ్రీనివాసులు(శుభోదయం న్యూస్):




సైదాపురం మండలంలోని పలు మైన్లను 18వ తేదీ మంగళవారం ఉదయం వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కురగొండ్ల రామకృష్ణతనిఖీ చేయడం జరిగింది. ఎమ్మెల్యే తో పాటు మైనింగ్ డిడి మరియు ఎమ్మార్వో సుభద్ర ఆర్ఐ ప్రదీప్ కుమార్ తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఈ తనిఖీ లో ఎమ్మెల్యే మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల యొక్క అవకతవకలతోనే అక్రమ మైనింగ్ జరుగుతున్నట్లు మరియు పర్మిషన్ ఒక చోట మైనింగ్ మరొక చోట జరుగుతున్నాయని ఈ అక్రమ మైనింగ్లో సిద్దలకోన దేవాలయ భూములు పూర్తిగా లోడేసి లక్షల కోట్లు ధనార్జన చేసి ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులను తూతూ మంత్రంగా చెల్లించి ప్రభుత్వాన్ని మోసం చేసినారు. అక్కడ ఉన్న ఓబీకి వాళ్ళ కట్టిన దానికి ఎటువంటి సంబంధం లేదు. అక్రమాలకు పాల్పడిన మైనింగ్ల లో ఒగ్గ కిష్టయ్య మైన్ దాసరమైన మరియు పీజె మైన్ ఇంకా కొన్ని మైనింగులు ఈ లిస్టులో ఉన్నాయి వాటి పైన కూడా కఠినమైన చర్యలు తీసుకోవాల్సిందిగా మైనింగ్ అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే కురగుండ్ల రామకృష్ణ.

## నల్లమోతు వారి పాలెం నాగేంద్ర స్వామి పుట్ట సత్యం గల స్వామి డిఎస్పి కందుల శివ పరమేశ్వర రావు స్వామి:

బాపట్ల జిల్లా(శుభోదయం న్యూస్):



మాస శివరాత్రి సందర్భంగా బాపట్ల జిల్లా నల్లమోతు వారి పాలెం హైవే పక్కన ఉన్న నాగేంద్ర స్వామి పుట్ట దగ్గర కాశీ నుండి తెచ్చిన శివలింగాన్ని ప్రతిష్టించిన సందర్భంగా మాస శివరాత్రి పురస్కరించు కొని శివలింగాన్ని దర్శించుకున్న డి.ఎస్.పి కందుల శివ పరమేశ్వరరావు(స్వామి), ఉప్పాల మురళి గురు స్వామి, ఈ సందర్భంగా డిఎస్పి కందుల పరమేశ్వరరావు స్వామి మాట్లాడుతూ నాగేంద్ర స్వామి పుట్ట ఎంతో మహిమ గల్లా స్వామిని, నేను చిన్నప్పటి నుంచి వచ్చినప్పుడల్లా స్వామిని దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొంటానని, స్వామి దీవెనలు అందరికీ ఉండాలని కోరారు, అదేవిధంగా బీసీ బడుగు బలహీన వర్గాల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఉప్పాల మురళి గురుస్వామి మాట్లాడుతూ, పుట్ట దగ్గర డిఎస్పి ని మర్యాదపూర్వకంగా కలిసి పూజ కార్యక్రమంలో పాల్గొన్నానని అదే విధంగా ఈ రాష్ట్ర దేశ ప్రజలందరికీ శివయ్య స్వామి దీవెనలు ఉండాలని మాస శివరాత్రి శుభాకాంక్షలు తెలుపుతున్న మీ మురళి గురు స్వామి,

## ఈ రాష్ట్రంలో కమ్మ రెడ్ల పాలన పోవాలి.. బహుజన రాజ్యం రావాలి

విశాఖపట్నం, (శుభోదయం న్యూస్):



17–11–25 విశాఖపట్నంలో ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల బాంసప్ నాయకుల సమావేశం పెద్ద ఎత్తున జరిగింది..ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ నేషనల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జె.పూర్ణచంద్ర రావు గారు హాజరయ్యారు..ఈ సమావేశాన్ని ఉద్దేశించి డాక్టర్ పూర్ణ చంద్ర రావు మాట్లాడుతూ దేశంలో మనువాద పార్టీలను ఈ రాష్ట్రంలో కమ్మా,రెడ్లు పార్టీలకు ఓట్లు వేయకుండా బహుజన రాజకీయ పాఠాలు చెప్పాలని అంతేకాకుండా మేధావులైన మనం మౌనంగా ఉంటే ఈ దేశంలో బహుజనులు నష్టపోయే పరిస్థితి ఉందని బహుజన ఉద్యోగ నాయకులందరూ ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీని ఈ రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురాటానికి కృషి చేయాలని కోరారు..ఉత్తరాంధ్ర బాంసప్ నాయకులందరూ ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీకి అండగా ఉంటామని 2029లో ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తానికి మా టైము, ట్రెజరీ అందిస్తామని తెలియజేశారు..ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర బాంసప్ పెద్ద ఎత్తున బాంసప్ నాయకులు పాల్గొనడం జరిగింది..

## బిర్యానీ కింగ్‌లపై ఐటీ దాడులు భారీగా ఎగవేసిన హోటల్స్

**హైదరాబాద్ :** నగరంలోని అత్యంత ప్రజాదరణ పొందిన మూడు బిర్యానీ రెస్టారెంట్ లపై ఆదాయపు పన్ను దర్యాప్తు విభాగం మంగళవారం ఉదయం నుంచి విస్తృత సోదాలు చేపట్టింది. పిస్తా హౌస్, షా గౌస్, మెహ్ఫిల్ గ్రూప్ ఆఫ్ రెస్టారెంట్స్‌లకు చెందిన కార్యాలయాలు, బ్రాంచ్‌లు, యజమానుల నివాసాలతో సహా దాదాపు 30 ప్రదేశాల్లో ఈ దాడులు జరుగుతున్నాయి.అనేక కోట్ల రూపాయల విలువైన అమ్మకాలను దాచిపెట్టి పెద్ద ఎత్తున పన్ను ఎగవేత జరిగినట్టు ఫిర్యాదులు వచ్చాయి. ప్రాథమిక సమాచారం లభించడంతో ఈ సోదాలు చేపట్టినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఆన్‌లైన్ ఆర్డర్లు, ఫ్రాంచైజీ వ్యాపారం, హలీమ్ సీజన్‌లో భారీ టర్నోవర్‌లను సరిగ్గా రికార్డు చేయకపోవడం, నగదు లావాదేవీలను దాచిపెట్టడం వంటి అంశాలపైనే దర్యాప్తు కేంద్రీకరించారు. పిస్తా హౌస్ షా అలీ బండాలోని ప్రధాన కార్యాలయం నుంచి ప్రారంభమైన సోదాలు రంగారెడ్డి జిల్లాలోని బ్రాంచ్‌ల్లోనూ నిర్వహిస్తున్నారు. 1997లో మొహమ్మద్ అబ్దుల్ మజీద్ స్థాపించిన ఈ బ్రాండ్ ఇప్పుడు భారత్‌తో పాటు అమెరికా, దుబాయ్, ఒమన్, కువైట్‌లలో మొత్తం 44 ఔట్‌లెట్లను నడుపుతోంది. సల్మాన్ ఖాన్ నుంచి రాజకీయ నాయకుల వరకు సెలబ్రిటీలకు పిస్తాహౌస్ బిర్యానీ ఇష్టం. గత కొన్నేళ్లుగా రంజాన్ హలీమ్ సీజన్‌లోనే అనేక కోట్ల రూపాయల వ్యాపారం చేస్తుందని అంచనా.

# అర్ధరాత్రి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంపీ ఆకస్మిక తనిఖీ

ఏలూరు జిల్లా, ప్రతినిధి -ప్రసాద్ (శుభోదయం న్యూస్):



ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం రాత్రి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. రాత్రి 11.30 సమయంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి కి వచ్చిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దాదాపు 45 నిమిషాలు అన్ని విభాగాలను కలియ తిరిగి పలువురు రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్యం, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పలువురు రోగులకు, వారి సహాయకులకు తన ఫోన్ నెంబర్ తో కూడిన విజిటింగ్ కార్డును స్వయంగా ఇచ్చిన ఎంపీ..సరైన వైద్యం అందకపోయినా, ఆసుపత్రిలో ఏదైనా ఇబ్బందులు ఎదురైనా లేదా వారు అందరి ముందు చెప్పుకోలేని సమయాలను తనకు నేరుగా కాల్ చేసి చెప్పాలని సూచించారు. ఐసీయూ, అత్యవసర విభాగం, జనరల్ వార్డ్ మరియు మహిళా ప్రసూతి ఆసుపత్రిలో పిల్లల కు మరియు తల్లులకు అందుతున్న సేవలను పరిశీలించిన ఎంపీ రాత్రి డ్యూటీ రిజిస్టర్ తనిఖీ చేసి, విధుల్లో ఉన్న డాక్టర్లు, ఇతర ఆసుపత్రి సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు అందించే మెడిసిన్స్ తనిఖీ చేసారు. డ్యూటీ లో ఉన్న వైద్యులు, నర్సులతో మాట్లాడుతు వారి సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరతను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు నర్సింగ్ సిబ్బంది. ప్రభుత్వంతో, ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడి సిబ్బంది కొరత తొలగించేందుకు ప్రయత్నిస్తానని ఎంపీ వారికి హామీ ఇచ్చారు.

# చోరీకి పాల్పడిన నిందితుడు అరెస్ట్

కర్నూలు జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ పి నాగరత్నం (శుభోదయం న్యూస్):





కర్నూల్ డిఎస్పికార్యాలయంలో వివరాలు వెల్లడించిన... కర్నూల్ డిఎస్పీ బాబు ప్రసాద్.కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు, కర్నూలు డిఎస్పి బాబు ప్రసాద్ పర్యవేక్షణలో కోడుమూరు సర్కిల్ ఇన్ స్పెక్టర్ తబ్రేజ్ గారు మరియు సి . బెళగల్ పోలీస్ స్టేషన్ ఎస్సై యు.. వేణు గోపాల్ రాజు ఆధ్వర్యంలో, ఎఎస్సైలు నాగయ్య , హెడ్ కానిస్టేబుల్ తిమ్మప్ప, కానిస్టేబుల్ లు మల్లికార్జున, సుధాకర్, భాస్కర్, సుధర్శన్ మరియు సత్యరాజు లు ప్రత్యేక బృందంగా ఏర్పడ్డారు. క్రైమ్ నెం. 155/2025 పై దర్యాప్తు ను కొనసాగించగా నేరముకు పాల్పడిన నిందితుడు గా ఉన్న గిర్నీ వెంకటేష్,( 45 సం లు) తండ్రి తిమ్మన్న తిమ్మం దొడ్డి గ్రామం, సి బెళగల్ మండలం. నేరానికి పాల్పడినటువంటి ముద్దాయి అయిన గిరిని వెంకటేష్ ని ఈరోజు ఉదయము 11 గంటల సమయంలో సి.బెళగల్ గ్రామం నుండి చింతామానుపల్లి గ్రామునకు పోవు దారిలో ఉన్న గుట్టల నాగమ్మ గుడి వద్ద సి.బెళగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. కర్నూల్ డిఎస్పీ బాబు ప్రసాద్ నిందితుని వివరాలను కర్నూల్ డీఎస్పీ కార్యాలయంలో వెల్లడిస్తూ మాట్లాడారు...సి. బెళగల్ పోలీసుస్టేషన్ పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామంలో సెప్టెంబర్ 25 న దొంగతనం జరిగిందని తిమ్మందొడ్డి గ్రామానికి చెందిన తెలుగు చిన్న రెడ్డి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు దొంగతనాల కేసులు, ప్రాపర్టీ కేసులలో దర్యాప్తులు వేగవంతం చేయడం జరిగిందన్నారు. పాతనేరస్తులను విచారణ చేయడం , సిసి కెమెరాల పుటేజిలను వర్క్ ఔట్ చేయడంతో ఈ నిందితుడి గుర్తించి పట్టుకున్నామన్నారు. సి. బెలగల్ మండలం, తిమ్మం దొడ్డి గ్రామానికి చెందిన గిర్ని వెంకటేష్ (45) నుండి సుమారు 9 తులాల బంగారు ఆభరణాలు సుమారు 55 తులాల వెండి లక్ష రూపాయల నగదు స్వాధీనపరచుకుని అరెస్ట్ చేయడమైనదన్నారు.రికవరి చేసిన ప్రాపర్టీని సంబంధిత యజమానులకు కోర్టు ద్వారా అప్పగించడం జరుగుతుందన్నారు. ముద్దాయిని ఈ రోజు రిమాండు కు పంపించడం జరుగుతుందన్నారు.ఇతని పై ఏమైనా పాత కేసులు ఉన్నాయా అని విచారణ చేస్తున్నామన్నారు. ఇతని వేలిముద్రలను సేకరించి అన్ని కోణాల్లో విచారిస్తున్నామన్నారు. ప్రాపర్టీ కేసుల పై పకడ్బందీగా దర్యాప్తులు చేపడుతున్నామన్నారు. ఈ ప్రెస్ మీట్ లో కర్నూలు డిఎస్పీ తో పాటు కోడుమూరు సిఐ తబ్రేజ్ సి. బెళగల్ ఎస్సై వేణుగోపాల్ రాజు సిబ్బంది ఉన్నారు.

## చారిత్రాత్మక ఆలయం ,జంగంవారిపల్లె దిగంబర మల్లిఖార్జున స్వామీ దేవస్దానం

ఎర్రగొండపాలెం మండల, రిపోర్టర్ నారాయణ(శుభోదయం న్యూస్):



యర్రగొండపాలెం మండలం జంగంవారిపల్లెలో దిగంబర మల్లిఖార్జున స్వామీ వారి అతిపురాతన కాలం నాటి ఆలయంగా పెరొందింది ,, దిగంబర మల్లిఖార్జున స్వామీ కొలువు తీరడంతో జంగంవారిపల్లె గ్రామానికి బయటనుంచి వచ్చె భక్తులు తరలి రావాడం విశేషం ఈ ఆలయం చారిత్రాత్మకంగా చరిత్రకలిగిన ఆలయంగా పెరుంది నలమల అటవీ ప్రాంతానికి దాపులో ఉండే చివరి గ్రామం కావాడం ఈ గ్రామం దాటుకొని పోవాలన్నా ఇంకో గ్రామం అనే మాటే కనపడదు గంజివారిపల్లి తరువాత చిట్టచివరి గ్రామం ఇదే కావాడం విశేషం ఇక్కడి ఈగ్రామంలో కొలువైన దిగంబర మల్లిఖార్జున స్వామీ దేవస్దానం ఒకటి. ప్రతి సంవత్సరం కార్తీక అమాస్యరోజు ఇక్కడ తిరునాళ్ళు అంగరంగ వైభవంగా జరుపు కోవాడం ఆనావాయితీ ఈనెల 20 తేదీ గురువారం తిరునాళ్ళు జరుప నున్నారు తిరునాళ్ళు ఎర్పాట్లతో దిగంబర మల్లిఖార్జున దేవస్దానం విరాజిల్లు తుంది ఈ తిరునాళ్ళమహొత్సవానికి హాజరయ్యే భక్తజనం కోసం పూర్తి స్దాయిలో ఎర్పాట్లు చెసినట్లు తెలిపారు ఆలయ దేవస్దానం కమీటివారు ఇప్పటికే కరపత్రాలను విడుదల చేసారు ,..

## పోలకల్ గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం

కర్నూలు జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ పి నాగరత్నం(శుభోదయం న్యూస్):



సి బెళగల్ మండలంలోని పోలకల్ గ్రామ రైతు సేవా కేంద్రం నందు మండల వ్యవసాయ అధికారి కి మల్లేష్ కుమార్ పొలం పిలుస్తుందని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు ఖరీఫ్లో సాగు చేసినటువంటి పత్తి పంటను సిసిఐకి అమ్మదలుచుకున్నవారు, వారు ఖచ్చితంగా 8 నుంచి 12% లోపల తేమ శాతాన్ని కలిగి ఉంటే అటువంటి పత్తిని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారు కొనుగోలు చేస్తారని తెలిపారు. అదేవిధంగా తేమ కలిగి ఉంటే ఆ పత్తిని రైతులు కచ్చితంగా ఆరబెట్టుకోవాలని తెలియజేశారు. ప్రస్తుతం సాగు చేస్తున్నటువంటి పంటలు శనగ పంట లో తీసుకోవాల్సినటువంటి సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి వ్యవసాయ అధికారి తెలియజేశారు. ముందుగా విత్తనం వేసేటప్పుడు కచ్చితంగా విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. విత్తన శుద్ధి ట్రైకోడెర్మా వీరిడి కానీ లేదా కార్బెండిజం లేదా మ్యాంకోజేబ్ తో కాని విత్తన శుద్ధి చేసుకోవాలని తెలియజేశారు. ముఖ్యంగా శనగ పంటలో శనగపచ్చ పురుగు ఆశిస్తుందని తెలియజేశారు. దీని నివారణకు పంట వేసిన 15 నుంచి 20 రోజుల నుంచి పురుగు సంతతి పై నిఘా ఉంచాలి. శనగపచ్చ నివారణకు ఎకరాకు నాలుగు నుంచి ఐదు చొప్పున లింగాకర్షణ బుట్టలను అమర్చాలి. ఈ బుట్టలో రెక్కల పురుగులు కనిపించిన వెంటనే ఒక లీటర్ నీటికి 5 ఎం ఎల్ వేప నూనె లేదా ఐదు శాతం వేప గింజల కషాయాన్ని పిచికారి చేసుకోవాలి. మొక్కలపై పెట్టిన గుడ్లు పొదగకుండా నాశనం చేయడానికి ఈ కషాయాన్ని పిచికారి చేసుకోవాలని తెలిపారు. అక్కడక్కడ పక్షిస్తావరాలను ఏర్పాటు చేసుకోవాలి. అదేవిధంగా పంటకు నాలుగు వరుసలో సజ్జ గాని జొన్న గాని కంచ పంట వేసుకోవాలని తెలియజేశారు. శనగ పంటలో ముఖ్యంగా ఎండు తెగులు అధికంగా కనిపిస్తుంది. తెగులు సోకిన మొక్కలని నిలువుగా కాండం నిలువుగా చీల్చి చూస్తే ముదురు గోధుమ వర్ణం లేదా నలుపు చారులు స్పష్టంగా కనిపిస్తాయి.ఈ తెగులు నివారణకు ఒక లీటర్ నీటికి 1.5 గ్రాము టెబ్యు కొనజోల్ లేదా 10 గ్రాముల ట్రైకోడెర్మా విరిడిని ఒక కిలో విత్తనాలకు కలిపి విత్తన శుద్ధి చేయడం వల్ల మొక్క మొదటి దశలో తెగులు వృద్ధి చెందకుండా అరికట్టడం జరుగు తుంది అని అన్నారు, ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఏఈవోలు శిరీష హిమబిందు విఎఏ లలిత, శశికాంత్ ఎంపీఈఓ వెంకటేష్ ,భాస్కర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ?ఏలూరు కలెక్టరేట్ లో ఎంపీ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం.

ఏలూరు జిల్లా ప్రతినిధి ప్రసాద్(శుభోదయం న్యూస్):



అనేక ప్రభుత్వ విభాగాల్లో పనులు నత్త నడకగా సాగుతుండటంపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆగ్రహం.జిల్లాలో దారుణంగా దెబ్బతిన్న రోడ్ల నిర్మాణంపై అధికారులు దృష్టి పెట్టాలని కోరిన ఎంపీ.12 ఆర్వీబీలకు కేంద్రం నుంచి అనుమతులు వచ్చినప్పటికీ నిర్మాణ పనులు ఇంతవరకూ మొదలు కాకపోవడంపై ప్రశ్నించిన ఎంపీ. సమస్యలు పరిష్కరించి, 2026 మార్చికి ఆర్వీబీల పనులు మొదలు పెట్టాలని ఆదేశించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్.జంగారెడ్డిగూడెం- ఏలూరు రోడ్డును జాతీయ రహదారిగా మార్చేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించిన ఎంపీ.ప్రతి మేజర్ కంపెనీ తమ లాభాల్లో 5 శాతం కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఖర్చు చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ, అనేక సంస్థలు నిధులు ఇవ్వటం లేదు అలాగే కొల్లేరు సమస్య పరిష్కరించేందుకు అటవీశాఖ అధికారులు మానవతా దృక్పథంతో రైతులకు సహకరించాలని కోరిన ఎంపీ.ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం, ఆసుపత్రి నిర్వహణ తీరుపై ఎంపీ, ఎమ్మెల్యేల ఆగ్రహం. పేషెంట్లకు మందులు సరిగా ఇవ్వటం లేదని వస్తున్న ఫిర్యాదులపై ఆసుపత్రి సూపరెంటెంట్ ను ప్రశ్నించిన ఎంపీ. తగిన చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి వర్గాలకు ఆదేశాలు.

## సి.బెళగల్ మండలంలో జడ్పీ సీఈఓ నాసర రెడ్డి పర్యటన

కర్నూలు జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ పి నాగరత్నం(శుభోదయం న్యూస్):



సి బెళగల్ మండలంలో జడ్పీ సీఈవో నాసర రెడ్డి పర్యటించారు ఆయన పోలకల్ గ్రామంలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాల లో ఆధార్ కార్డు సెంటర్ చేశారు అనంతరం సి.బెళగల్ సచివాలయం -2 ను తనిఖీ చేశారు ఆయన గ్రామాలలో సర్వేలలో పురోగతి కనపరచవలసినదిగా మరియు సిబ్బంది సమయపాలన పాటించాలని అన్నారు మరియు ఆన్లైన్లో హాజరు నమోదు చేయవలెనని ఆదేశాలు జారీ చేసి ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి కార్యాలయం ఏవో శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దోర్నాల మండలంలోని పొలం పిలుస్తుంది కార్యక్రమం

దోర్నాల మండల, రిపోర్టర్ ఆవులయ్య(శుభోదయం న్యూస్):




ప్రకాశం జిల్లా దోర్నాల మండలం ఈ రోజు అనగా తేది :18.11.2025 న దోర్నాల మండలం లోని హాసనాబాద్ మరియు జమ్మిదోర్నాల గ్రామాలలో వ్యవసాయ శాఖ వారు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ పాల్గొని గ్రామం లో సాగు చేసిన మిరప మరియు కంది పంటలను సందర్శించడం జరిగింది. ప్రస్తుతం కంది పంట పూత దశ లో ఉంది కాబట్టి ముందుగా రైతులు వేప గింజల కాషాయం 500 ఒక ఎకరానికి పిచికారీ చేయాలి అలాగే పూత లో పురుగు నివారణకు క్లోరి పై రి ఫాస్ 2.5 ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. అలాగే సీడ్ ప్రొడక్షన్ కింద మొక్క జొన్న సాగు చేసే రైతులు తప్పనిసరిగా కంపెనీ వారి వద్ద నుండి అగ్రిమెంట్ పొందిన తరువాత మాత్రమే మొక్క జొన్న పంట సాగు చేయాలనీ తెలిపారు. పొగాకు పంట ను రైతులు సాగు చేయరాదాని పొగాకు పంటను ప్రభుత్వం నీషేధం చేయడం జరిగింది. కాబట్టి పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంట లైన సెనగ, మినుము, బొబ్బర్లు, జొన్న, కొర్ర, మొక్కజొన్న పంటలు రభి కాలం లో సాగు చేసుకోవచ్చని రైతులకు తెలియజేసారు.అలాగే ప్రస్తుతం మిరప పంట లో తామర పురుగు నివారణకు నీలి రంగు జిగురు అట్టలు ఎకరానికి 20 ఏర్పాటు చేసుకోవాలి. పిప్రోనిల్ 2 ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.మిరప లో కొమ్మ ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలనీ తెలిపారు.ఈ కార్యక్రమం లో రవి కుమార్, శిరీష, రైతులు పాల్గొన్నారు.

## స్టేట్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ వింగ్ పదవికి నియామకమైన డాక్టర్ విజయ్ భాస్కర్ రెడ్డి

బద్వేల్ నియోజకవర్గం, రిపోర్టర్ శివారెడ్డి(శుభోదయం న్యూస్):



కడప జిల్లాలో మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సన్రైజ్ హాస్పిటల్ డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి కి వైఎస్ఆర్సిపి స్టేట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ వింగ్ గా నియమించడం జరిగింది.. డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ జగనన్నకు అండగా నేను సైతం అంటూ పార్టీని మరింత బలోపేతం చేయడానికి రాష్ట్రానికి సుపరిపాలన మళ్లీ వచ్చే విధంగా తన కార్యచరణ రూపొందించుకొని పార్టీ కోసం కృషి చేస్తామన్నారు...

## వైయస్సార్సీపి కార్యాలయం పై దాడి నీచమైన చర్య

సిద్దవటం మండల, విలేకరి జాకీర్ హుస్సేన్(శుభోదయం న్యూస్):



హిందూపురంలో వైయస్సార్సీపి పార్టీ కార్యాలయం పై టిడిపి వారు దాడి చేయడం నీచమైన చర్య అని వైయస్సార్సీపి అన్నమయ్య జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కోటపాటి పెంచలయ్య తెలిపారు. సిద్ధవటం లో మంగళవారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు కుళ్ళు, కుతంత్రాలతో భయపెట్టి రాజకీయాలు చేయడం ఆయన మూర?త్వం అన్నారు. కూటమి ప్రభుత్వం పనితీరును ఎప్పటికప్పుడు ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. రాబోవు రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఇకనైనా దాడులకు స్వస్తి పలికి ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలన్నారు. లేదంటే భవిష్యత్తులో కూటమి ప్రభుత్వం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

## సిద్ధవటం మండలంలో టీడీపీ నూతన పార్టీ కార్యాలయం పరిశీలన

సిద్ధవటం మండల, విలేకరి జాకీర్ హుస్సేన్(శుభోదయం న్యూస్):



రాజంపేట ఇంచార్జి శ్రీ జగన్ మోహన్ రాజు గారి ఆదేశాల మేరకు సిద్దవటం మండలంలో తెలుగు దేశం పార్టీ నూతన కార్యాలయం కోసం అనువైన భవనం పరిశీలించి ఎంపిక చేయడం జరిగింది. త్వరలో ఈ కార్యాలయాన్ని ప్రారంభించి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా ప్రజా దర్బార్ వంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు పార్టీ నిర్ణయం తీసుకుంది. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు, అలాగే కార్యకర్తలు సౌకర్యంగా చేరుకునేలా ఈ కార్యాలయం సేవలందించనున్నది. ఈ పరిశీలన కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు రాజశేఖర్ యాదవ, పార్లమెంట్ కార్యదర్శి నాగముని రెడ్డి, క్లస్టర్ ఇంఛార్జి ధరపనేని రాజా నాయుడు, బీసీ అసెంబ్లీ అధ్యక్షులు కె. చెంచయ్య నాయుడు, పంచాయతీ రాజ్ స్టేట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ కుప్పాలా వెంకట సుబ్బయ్య, నాయకులు శ్రీనివాసులు, శంకర్ పాల్గొన్నారు.పార్టీ నాయకులు వెల్లడిస్తూ కొత్త కార్యాలయం ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్రబిందువుగా నిలుస్తుందని, త్వరలో గ్రాండ్ ఓపెనింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

## నేడు అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ కార్యక్రమాలకు రైతులు భారీగా తరలిరండి

కనేకల్లు మండల, విలేకరి మాల్యం కిరణ్ కుమార్(శుభోదయం న్యూస్):



రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాలు రైతులకు పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ కార్యక్రమాలను కలిసి బుధవారం కనేకల్ మండల కేంద్రంలో మధ్యాహ్నం రెండు గంటల 30 నిమిషాలకు నిర్వహిస్తున్నారని కనేకల్ మండల వ్యవసాయ అధికారి జగదీష్ బాబు విలేకరుల సమావేశంలో వెల్లడించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయదుర్గం నియోజకవర్గం లోని 38508 మంది రైతులకు 28.958 కోట్ల రూపాయలకు నిధులను రైతులకు జమ చేస్తారని ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు తరలిరావాలని ఆయన కోరారు

## సర్పంచులకు పచ్చదనం పరిశుభ్రత పై అవగాహన

కనేకల్ మండల, విలేఖరి మాల్యం కిరణ్ కుమార్(శుభోదయం న్యూస్):






మండల కేంద్రమైన కనేకల్లో బుధవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో 18,19 మరియు 21 తేదిలలోపచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. మొదటి రోజు సర్పంచులకు ఉపసర్పంచులకు మరియు పంచాయతీ కార్యదర్శులకు పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంపై శిక్షణ తరగతులు . అన్ని గ్రామాల యందు పరిశుభ్రత మరియు పచ్చదనం కార్యక్రమం పై అందరూ శ్రద్ధ పెట్టి గ్రామాలను ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండేటట్లు చూడాలని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వి విజయ సింహా రెడ్డి, అనంతపురం డి పి ఆర్ సి నుండి రిసోర్స్ పర్సన్ అఫ్జల్ భాషా. మరియు డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి. మరియు మండలంలోని అందరు సర్పంచులు ఉప సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# త్రిపురాంతకం మండలంలోని పొలం పిలుస్తుంది కార్యక్రమం

త్రిపురాంతకం మండల, రిపోర్టర్ గుత్తా మూర్తేయ్య (శుభోదయం న్యూస్):

వ్యవసాయ శాఖ త్రిపురాంతకం మండలం త్రిపురాంతకం మండలంలోని వెల్లంపల్లె మరియు విశ్వనాధపురం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి బి సంగమేశ్వరరెడ్డి గారి అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం అయినది ఈ కార్యక్రమంలో భాగంగా మండలం వ్యవసాయ అధికారి గారు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో పండించే పంటల గురించి అడిగి తెలుసుకున్నారు. .అలాగే వెల్లంపల్లె గ్రామంలో వరి పంటలను పరిశీలించటం జరిగింది. వరి పంట లో పంటలో దోమ గమనించారు, దోమ నివారణకు ముందస్తు చర్యగా పైమెట్రోజైన్ (50%) పిచికారీ చెయ్యగలరు అని సూచించారు , అదే విధంగా ప్రతి రైతు మోతదు కు మించి ఎరువులు వాడరాదు అని తెలపటం జరిగింది, ఎక్కువ మోతదు లో ఎరువులు వాడటం ద్వారా పురుగుల ఉధృతి ఎక్కువ అయి పంటకు నష్టమే కానీ లాభం చేకూరదు అని తెలిపారు. అదే విధంగా వ్యవసాయ అధికారి బి. సంగమేశ్వర రెడ్డి గారు త్రిపురాంతకం గ్రామంలో వరి పంట ను పరిశీలించటం జరిగింది. వరి పంటలో కాండం కుళ్ళు తెగ్గులు, అగ్గి తెగులను గమనించటం జరిగింది. కాండం కుళ్ళు తెగుళ్ల నివారణకు హెక్సకోనజోలే 2.5 మి. లి లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి అని తెలిపారు.పంటలో అగ్గి తెగులు




ఎక్కువ గా ఉన్నట్లయితే ట్రైసైక్లోజోల్ 75 ను ఎకరానికి 125 గ్రాములు పిచికారీ చేసుకోవాలి అని సూచించటం జరిగింది. అదే విధముగా రబీ సాగు చేసే రైతులకు మినుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయి అని తెలిపారు 30% సబ్సిడీ అని తెలిపారు. ధర కిలో 98 రూపాయలు అని తెలపటం జరిగింది. కావలసిన రైతులు స్థానిక రైతు సేవ కేంద్ర సిబ్బంది ని సంప్రదించండి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్ జాషువ గాలి యోగేశ్వరరావు, మరియు గ్రామ రైతులు పెద్దలు పాల్గొన్నారు

# బి కోడూరు మండలంలోని శివాలయాన్ని దర్శించుకున్న పోతిరెడ్డి నాగార్జున్ రెడ్డి

బద్వేల్ నియోజకవర్గం, రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్):

పోరుమామిళ్ల మండలం బి కోడూరు మండలం మధ్యలో వెలిసియున్న అతి పురాతన దేవాలయం. ఎన్నో మహిమలు కలిగిన ప్రదేశం.దప్పిలమ్మ గుడి ని. మరియు శివాలయాన్ని దర్శించుకున్న. దంపతులు. మాజీ ప్రభుత్వ సలహాదారు పి ఆర్ అండ్ ఆర్ డి ఏపీ. పోతిరెడ్డి నాగార్జున రెడ్డి . శ్రీమతిసురేఖ దంపతులు. ఈ సందర్భంగా నాగార్జున రెడ్డి మాట్లాడుతూ దాదాపు 1000 సంవత్సరాల క్రితం ఇక్కడ నిర్మించబడిన అతి పురాతన దేవాలయం దప్పిలమ్మ గుడి ఇక్కడ మునులు . తపస్సు చేశారని. ఈ ప్రదేశం మహిమ గలిగిన ప్రదేశమని. కొండ పై భాగం కోనేరు.నుండి ఎప్పటికీ నీరు వస్తూ ఉండడం. ఎంత కరువు వచ్చినా ఇక్కడ నీరు ఉండడం. ఈ స్థలం యొక్క ప్రత్యేకత. ఇక్కడ శివాలయం మరియు దప్పిలమ్మ గుడి ఉండటం రాష్ట్ర నలుమూలల నుండి వేలాది మంది భక్తులు ఇక్కడికి వచ్చి దర్శించుకోవడం ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో ఇక్కడికి ప్రజలు రావడం జరుగుతూ ఉంది సరైన రోడ్డు మార్గం



ఏర్పడితే ఇంకా ఎక్కువ భక్తులు వచ్చే అవకాశం ఉంటుందని ప్రభుత్వం ఈ దేవాలయానికి మెయిన్ రోడ్డు నుంచి వస్తా ఏర్పాటు చేసే విధంగా. అధికార పార్టీ లో ఉన్న నాయకులు చూడాలని. ఈ గుడిని నూతనంగా నిర్మించాలని మాజీ జెడ్పిటిసి బి. కోడూరు. రామకృష్ణారెడ్డి ప్రయత్నం చేస్తున్నారు. దాతలు ముందుకు వచ్చి ఈ ఆలయం నూతనంగా నిర్మించే దానికి సహాయ పడాలని. ఇంతవరకు ఈ ఆలయ అభివృద్ధికి



రామకృష్ణ రెడ్డి గారు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని. నాగార్జున రెడ్డి ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో. వెంగళరెడ్డి. మాజీ సింగిల్ విండో అధ్యక్షులు. వీరభద్రుడు సర్పంచ్. కృష్ణారెడ్డి ఎంపీటీసీ . గనుకపెంట. అందరిని దేవస్థానం కమిటీ వారు సన్మానం చేయడం జరిగింది.

# శ్రీ సీతారాముల నూతన విగ్రహ కళ్యాణ మహోత్సవం







బద్వేల్ నియోజకవర్గం, రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్):

బద్వేల్ పట్టణంలోని ఆంజనేయ నగర్ లో నూతనంగా వెలసిన శ్రీ సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అంగరంగ వైభవంగా కళ్యాణ మహోత్సవం నిర్వహించారు.. ఈ కళ్యాణ మహోత్సవంలో భక్తులు పాల్గొని శ్రీ సీతారాముల కల్యాణాన్ని కన్నుల విందుగా తిలకించారు స్వామి వారి యొక్క ప్రసాదాలు భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు బలి సంఘం అధ్యక్షుడు సింగంశెట్టి వెంకటసుబ్బయ్య మార్కెట్ చిన్ని సుబ్బారావు లాయర్ ప్రసాదు మొదలైన వారు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం ఆత్మగౌరవం కాపాడాలని తాసిల్దార్ కు వినతి పత్రం

ఏలూరు జిల్లా, ప్రతినిధి ప్రసాద్ (శుభోదయం న్యూస్):

ఏలూరు జిల్లా చింతలపూడి సామాజిక న్యాయం ఆత్మగౌరవం కాపాడాలని సిపిఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు అన్నారు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా ఈరోజు స్థానిక కారుమూడి సత్యనారాయణ రెడ్డి భవన్ నుంచి తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం తాసిల్దార్ వారికి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా తొర్లపాటి బాబు మాట్లాడుతూ ఉత్తరా భారతదేశంలో దళిత గిరిజన మహిళలపై జరుగుతున్న దాడులను ఆపాలని అదే విధంగా 2026 లో జరుగుతున్న జన గణ నలో కుల గణన కూడా చేపట్టాలని సిపిఐ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా ఈరోజు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం దళిత గిరిజనులపై జరుగుతున్న దాడుల విషయంలో వారికి ఏమీ సంబంధం లేనట్లు చేసే వారిని ప్రోత్సహిస్తున్నారని దళిత గిరిజనులపై దాడులను ఆపాలని దేశ వ్యాప్తంగా జరుగుతున్న జనగణనలో కులగణ ను కూడా చేపట్టాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కంచర్ల గురవయ్య వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు బోడ వజ్రం సిపిఐ జిల్లా సమితి సభ్యులు తొర్లపాటి రాజు సిపిఐ మండల కమిటీ సభ్యులు ఎస్.కె కాలేశా సిపిఐ నాయకులు ఎస్కే మస్తాన్ తాడిగడప మాణిక్యాలరావు మోర్తా అమ్ములు ముల్ల




గిరి అలెగ్జాండర్ గట్టు వెంకటేశ్వరరావు మా ఊరి సత్యనారాయణ రెడ్డి ఏఐవైఎఫ్ నాయకులు నక్క వంశీ తదితరులు పాల్గొన్నారు

# కార్తీక మాసం 4 వ మంగళవారం సందర్భముగా, 40వేల భక్తులుతో దర్శనమిస్తున్న మద్ది ఆంజనేయస్వామి ఆలయం

ఏలూరు జిల్లా(శుభోదయం న్యూస్):

ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలము, గురవాయిగూడెం గ్రామము నందు తెల్ల మద్ది చెట్టు క్రింద స్వయంభువులై వెలిసిన శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి దర్శనార్ధము చుట్టు ప్రక్కల గ్రామముల నుండియే గాక సుదూర ప్రాంతముల నుండి అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీ స్వామి వారి ఆలయము చుట్టూ 108 ప్రదక్షణలు చేసి, మొక్కుబడులు తీర్చుకుని, శ్రీ స్వామి వారికి అత్యంత ప్రీతీకరమైన తమలపాకులు (నాగవల్లీ దళములు)తో అష్టోత్తరం పూజలను, అన్నప్రాసనలు, వాహనం పూజలు శ్రీ స్వామి వారి దేవస్థానం నందు గల ఉసిరి చెట్టు వద్ద కార్తిక దీపాలను వెలిగించినారు. ఈ రోజు శ్రీ స్వామి వారి దర్శనార్థం సుమారు 40,000 ల మంది విచ్చేసి యున్నారు. ఈ రోజు మద్యాహ్నం/సాయంత్రం గం.3-00 వరకూ విచ్చేసిన సుమారు 16,000 మంది భక్తులకు శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన సత్రము నందు అన్నప్రసాద వితరణ జరుపబడినది. ఈ రోజు మద్యాహ్నం/సాయంత్రం గం.3-00 వరకూ శ్రీ స్వామి వారి దేవస్థానమునకు వివిధ సేవల రూపేణా రూ.9,95,438/ - లు ఆదాయము వచ్చినది. ఈ రోజు చక్రదేవరపల్లి గ్రామస్తులచే, దాతల సహకారముతో శ్రీ స్వామి వారి కార్తీకమాస అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించబడినది. శ్రీ స్వామి వారి దర్శనార్థమై విచ్చేసిన భక్తుల రద్దీ దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జంగారెడ్డిగూడెం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.వి సుభాష్ లక్కవరం స్.ఐ. స్ కె,జాబిర్, జంగారెడ్డిగూడెం ఎస్సై వరప్రసాద్ తడికలపూడి ఎస్సై చిన్నారావు మరియు జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ ఎస్సై. కుటుంబరావు భారీ బందోభస్తూ ఏర్పాటు చేసినారు. ఇంకా జంగారెడ్డిగూడెం అగ్నిమాపక సిబ్బంది, బొర్రంపాలెం పి హెచ్ సి, వారిచే మెడికల క్యాంప్ వారిచే తగిన ఏర్పాట్లు గావించినట్లు ఆలయ సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధి కారిణిర్ వి.చందన తెలియజేశారు. అనంతరం రాత్రి మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయ పుష్కరిణి అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్, మరియు కార్య నిర్వహణ అధికారి తదితరులు పాల్గొన్నారు.





# మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రచ్చబండ కార్యక్రమం






ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం రిపోర్టర్ కిషోర్ బాబు(శుభోదయం న్యూస్):

జంగారెడ్డిగూడెంలో ముఖ్యఅతిథిగా మచిలీపట్నం పరిశీలకులు గౌరవ శ్రీ జెట్టి గురునాధ రావు,ఏలూరు జిల్లా వైఎస్ఆర్సిపి కార్యదర్శి ముప్పిడి శ్రీను వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, పట్టణ అధ్యక్షులు కర్పూరం గవరయ్య గుప్తా, కౌన్సిలర్లు చిటికెల అచ్యుతరామయ్య, ఎల్విఆర్ నేకూరి కిషోర్, ఉగ్గం దుర్గాప్రసాద్, కనుమూరి లావణ్య ,అనుబంధ విభాగ అధ్యక్షులు తాడేపల్లి ఉమాదేవి,పటాన్ పర్వేజ్, జీడిగంటి రామారావు, వైసిపి నాయకులు అడపాల రాంబాబు, మహమ్మద్ కబీర్, కంచర్ల విష్ణు, గెద్దాడ శ్రీను, షేక్ అమీర్, నెట్రు గణేష్, పెసర గంటి త్రిమూర్తులు, కిరణ్, జహీర్, కందుకూరి నాగు, ఎండి జాబిర్, సుభాని, బెజవాడ సుబ్బారావు, రామ్ శెట్టి కిషోర్, రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న మచిలీపట్నం పరిశీలకులు జెట్టి గురునాధరావు, మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు పేదవాడికి ఉపయోగపడాలని జగన్ మోహన్ రెడ్డి,ఆలోచన చేస్తే కూటమి ప్రభుత్వం పిపిపి విధానాన్ని తీసుకొచ్చి పేదవాడికి వైద్యం అందకుండా చేయాలని ముఖ్య ఉద్దేశంతో చూస్తుందని ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ ప్రజల దగ్గర నుండి సంతకాల సేకరణ కార్యక్రమం ద్వారా గవర్నర్ అందజేసి ప్రైవేటీకరణ ఆలోచనలు ప్రభుత్వం గర్వించుకోవాలని ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు సహకరించాలని తెలియజేశారు.

## పొదలకూరు రాపూర్ మధ్య రాకపోకలకు అంతరాయం

నెల్లూరు జిల్లా, ప్రతినిధి శ్రీనివాసులు (శుభోదయం న్యూస్):



నెల్లూరు జిల్లాలో గత రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దేగపూడి సమీపంలోని రాజుపాలెం వద్ద కల్వర్టు కుప్పకూలిపోవడంతో రాపూరు మరియు పొదలకూరు మధ్య వాహన రాకపోకలు నిలిచిపోయినాయి. ఈ కారణంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురి అయినారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని వాహన రాకపోకలను పునరుద్ధరించాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

## వైసీపీ నేత కారుమూరి వెంకటరెడ్డి అరెస్ట్

**హైదరాబాద్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కారుమూరు వెంకట్‌రెడ్డి అరెస్ట్ అయ్యారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ఏరియాలో ఏపీలోని తాడిపత్రి పోలీసులు వెంకట్ రెడ్డిని అదుపులోకి తీసుకుని ఏపీకి తరలిస్తున్నారు. వైసీపీ నేత కారుమూరి వెంకట్‌రెడ్డిపై ఆంధ్రప్రదేశ్‌లో పలు కేసులు నమోయ్యాయి.వైసీపీ నేత వెంకట్‌రెడ్డిపై నమోదైన కేసుల వివరాలు పరిశీలిస్తే, ఇటీవల తిరుమల పరకామణి కేసులో ఫిర్యాదుదారు అయిన సతీశ్‌కుమార్ నవంబర్ 14వ తేదీన తాడిపత్రి సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన హత్యకు గురయ్యాడు. దాంతో ఏపీ పోలీసులు ఈ కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టలను దెబ్బతీసేలా వ్యవహరించడం, సీఎం చంద్రబాబు నాయుడుపై వైసీపీ నేత కారుమూరి అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కర్నూలు బస్సు ప్రమాదం తర్వాత ఓ టీవీ ఛానల్ డిబేట్‌లో పాల్గొన్న వెంకట్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై, సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని తాడిపత్రి టీడీపీ నేత ప్రసాదనాయుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.టీడీపీ నేత ఫిర్యాదు ఆధారంగా కారుమూరు వెంకట్ రెడ్డిపై తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# మెప్మా అర్పిల సమస్యల పరిష్కరించాలి అని ఆందోళన

ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం, రిపోర్టర్ కిషోర్ బాబు(శుభోదయం న్యూస్):

జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ ఈరోజు నవంబర్ 18 వ తేదీ మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో సమస్యలు పరిష్క రించాలి అని మున్సిపల్ ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమం చేసి అనంతరం సీఎం ఎం కే నాగమణికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది, ఈ సందర్భంగా మెప్మా ఆర్పిలా సంఘం జిల్లా నాయకులు ఎస్కే సుభాషిని మాట్లాడుతూ, కాలపరిమితి రద్దు చేసినందుకు వర్షం వ్యక్తం చేస్తున్నాం. కానీ గ్రేడింగ్ పద్ధతిలో ఈ రోజున ఆర్పి లతో వెట్టి చాకిరి ఈ ప్రభుత్వం చేయించు కుంటుంది అని నెల అంతా ఆన్లైన్లో వర్కులు చేసిన 1500 మాత్రమే ఈ రోజున వేతనం వస్తుందని 8 ఎనిమిది వేల రూపాయలు తీసుకోవడం అనేది చాలా కష్టదాయకం అవుతుందని ఈరోజు నాకు కష్టపడేది ఆ వేతనం కోసమేనని కుటుంబాలు గడవాలి అని అంటే సమాన పనికి సమాన వేతనం ఉండాలని ఒక పక్కన దీనిపై మాట్లాడుతూ ఉంటే ఈ రోజున ఎనిమిది వేల జీతం అని చెప్పి ఈ ప్రభుత్వం గ్రేడింగ్ పద్ధతిలో ఈ విధంగా కోతలు విధించడం దుర్మార్గమని వెంటనే దీన్ని రద్దు చేయాలని అదేవిధంగా ఆన్లైన్ ఆర్డర్ల పేరుతో పిండి వంట లు టార్గెట్ పెట్టి ఆర్డర్లు పెట్టించాలి అంటే గ్రూపు సభ్యుల చేత పెట్టిస్తేనాణ్యత లేని వంటకాలు వస్తున్నాయని గ్రూపు వాళ్ళ ఆవేదన చెందుతున్నారని దీనిపై అధికారులను అడిగితే ఇష్ట సారంగ సమాధానం చెప్తున్నారు పైగా ఇలాంటివి అడక్కూడదు అని బెదిరించే కార్యక్రమాలు చేస్తున్నారు అదే కాదు పై నుండి మాకు ఈ విధంగానే ఇన్స్ట్రక్షన్స్ వచ్చినవి ఈ విధంగానే మేము చేస్తాము అని సంబంధిత అధికారులు యూనియన్ లీడర్లకే ఇలాంటి మీరు ఆడ కూడదు అని డైరెక్ట్ గా తెలుపుతున్నారు. ఈ రోజున మేము ఒకటే అడుగుతున్నాం రౌండ్ లెవెల్లో ఆర్పీలు పనిచేస్తున్నప్పుడు సమస్యలు వాళ్లకే తెలుస్తాయి గుర్తించే వాటిని అధికారులకు తెలిపితే కనీసం పై స్థాయి తీసుకువెళతామనే సమాధానం లేకుండా అధికారులు ఈ విధంగా ఇబ్బంది పెట్టడం సరికాదు అని దీనిని వెంటనే ఖండించారు. దీనితోపాటు కనీస వేతనాలు అమలు చేయాలని ఆన్లైన్ సమస్యలు పరిష్కరించాలని కేసు యాప్ ను రద్దు చేయాలని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎం నాగలక్ష్మి ,కార్యదర్శి జి మోహిని కుమారి, కోశాధికారి స్వర్ణ, వెంకట నీలిమ, అష్రాఫ్ వి నాగలక్ష్మి, సునీత, విజయ దుర్గ, ధనలక్ష్మి, అప్సర్ వెంకటలక్ష్మి ,స్వప్న, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.ఇట్లు మెప్మా ఆర్పీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ సుభాషిణి 8919894722



# యాజలి కాశి విశ్వేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించిన గుండ్రెడ్డి శివ దంపతులు

బాపట్ల జిల్లా(శుభోదయం న్యూస్):

బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజలి గ్రామంలోని శ్రీ దేవాలయ ప్రాంగణంలో వేయించేసియున్న శ్రీ కాశి విశ్వేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం మాస శివరాత్రి సందర్భంగా కర్లపాలెం మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గుండ్రెడ్డి శివ, అనురాధ దంపతులు కాశీ విశ్వేశ్వర స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం గొండ్రెడ్డి శివ అనురాధ దంపతులు 11 కేజీల కర్పూరంతో కార్తీక జ్యోతి వెలిగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సుమారుగా 1200 మందికి అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో శివాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జనసేన నాయకుడు ఇక్కుర్తి వెంకటాద్రి నాయుడు బాపట్ల కాపు సంఘం అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు, ఉప్పాల సాంబయ్య, బేసబత్తుని సత్యనారాయణ, ఆలయ మేనేజర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థిని, విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ మీద క్విజ్ పోటీలు

పెదపాడు మండల, రిపోర్టర్ నవీన్(శుభోదయం న్యూస్):



ఏలూరు జిల్లా,పెదపాడు శాఖ గ్రంథాలయం నందు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఈరోజు 10 వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ మీద "క్విజ్ పోటీలు" నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమంలో పెదపాడు సెంట్ అగస్టీన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, పెదపాడు జడ్ . పి.హెచ్ స్కూల్ విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం నిర్వాహకులుగా సెంట్ అగస్టీన్ ఇంగ్లీష్ మీడియం హెచ్.ఎం జెస్సింత సూల్వ, కే. జోషిలా,సిహెచ్. శిరీష, బి.మోహన్ కుమార్ మరియు పెదపాడు జడ్ పి.హెచ్ స్కూల్ సోషల్ మాస్టర్ బి. నాగరాజు, సైన్స్ టీచర్ జె. కనకమహాలక్ష్మి నిర్వహించి నారు. విజేతలకు 20వ తేదీ గురువారం బహుమతులు ప్రముఖులచే అందజేయబడును ఈ కార్యక్రమం గ్రంథాలయాధికారి దుగ్గిపోగు జాన్ బాబు పర్యవేక్షణలో జరిగినవి,క్విజ్ పోటీలు నిర్వహించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేసినారు. పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులకు స్నాక్స్ పంచిపెట్టడం జరిగినది అని తెలియజేసినారు.

## గురిజే పల్లిలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం రెండో విడత నిధుల విడుదల కార్యాక్రమం

ఎర్రగొండపాలెం మండల, రిపోర్టర్ నారాయణ(శుభోదయం న్యూస్):



రైతులకు పంట పెట్టుబడి సహాయంగా అందిస్తున్న అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం డబ్బులు రైతుల ఖాతాలల్లో జమ కానున్నాయి. రెండో విడత నిధులు కేంద్ర ప్రభుత్వంతోపాటు ఏపీ ప్రభుత్వం జమ చేయనుంది. కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు, ఏపీ ప్రభుత్వం రూ.5 వేలు రైతులకు ఇస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా యర్రగొండ పాలెం మండలం గురిజెపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విడుదల చెయనున్న అన్నదాత సుఖీభవ కార్యాక్రమం ప్రత్యక్షప్రసార వీక్షిణం వ్యవసాయ శాఖ అధ్వర్యంలో ఎర్పాటు చెసారు ఈ కార్యాక్రమనికి యర్రగొండపాలెం నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ముఖ్యఅతిగా పాల్గొంటారని యర్రగొండపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తెలిపారు కావున మండలంలోని ప్రజాప్రతి నిధులు టీడీపీ మండల నాయకులు వివిధ విభాగాల తెలుగుదేశం పార్టీ నాయకులు కూటమి నాయకులు, క్లస్టర్,యూనిట్,బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు,రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు ...

## ఏలూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

పెదపాడు మండల, న్యూస్ రిపోర్టర్ వన్నెకూటి నవీన్ (శుభోదయం న్యూస్):



ఏలూరు జిల్లా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీ చేశారు దాదాపు 45 నిమిషాలు అన్ని విభాగాలను తిరిగి పలువురు రోగులు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకోవడం జరిగింది అనంతరం వారి సమస్యలను తెలుసుకొని ఏదైనా వైద్యం సరిగ్గా అందకపోయినా లేదా ఏ సమస్య ఉన్న ఫోన్ చేయండి అని విసిటింగ్ కార్డు అందించడం జరిగింది అనంతరం డ్యూటీలో ఉన్న డాక్టర్లు సిబ్బందితో మాట్లాడి రోగులకు అందిస్తున్న వైద్యం గురించి తెలుసుకొని వారి సమస్యలను కూడా తెలుసుకోవడం జరిగింది.

## అయ్యప్ప స్వామి వారి గ్రామస్థువ కార్యక్రమం

బద్వేల్ నియోజకవర్గం, రిపోర్టర్ శివారెడ్డి(శుభోదయం న్యూస్):



కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గం లో బద్వేల్ పట్టణంలో శ్రీ హరిహర పుత్రుడు ఆనంద చిత్రుడు అయ్యప్ప స్వామి వారి గ్రామస్తవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వాములు నిర్వహించారు.. ఈ అయ్యప్ప స్వామి వారి గ్రామస్తువంలో కోలాటాలు నాటక ముత్యాలు సంగీత వాయిద్యాలతో అంగరంగ వైభవంగా శ్రీ అయ్యప్ప స్వామి వారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పెద్ది సుధా పెరుగు వెంకటయ్య డివి వెంకటేశ్వర్లు మొదలైన స్వాములు పాల్గొన్నారు...

## సరికొత్త స్క్రీన్ ప్లేతో రాజ్ తరుణ్ 'టార్టాయిస్'



రాజ్‌తరుణ్, అమృత చౌదరి జంటగా, అవసరాల శ్రీనివాస్, ధన్యా బాలకృష్ణ ప్రధాన పా?త్రల్లో 'టార్టాయిస్' అనే కొత్త సినిమా ఆరంభమైంది. రిత్విక్ కుమార్ దర్శకత్వంలో ప్రశ్విత ఎంటర్‌టైన్మెంట్, ఎస్‌కే గోల్డెన్ ఆర్ట్స్, చందమామ క్రియేషన్స్, ఎన్‌వీఎల్ క్రియేషన్స్‌పై శశిధర్ నల్ల, విజయ్ కుమార్, ఇమ్మడి సంతోష్, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. ఈ ప్రారంభోత్సవం సందర్భంగా సినిమా మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. రాజ్ తరుణ్ మాట్లాడుతూ%-% "టార్టాయిస్' చిత్రం చాలా కొత్తగా, వైవిధ్యంగా ఉంటుంది. నా కెరీర్‌కు కిక్ ఇచ్చే చిత్రం ఇది" అని తెలిపారు. "సరికొత్త స్క్రీన్ ప్లేతో సాగే థ్రిల్లర్ చిత్రం ఇది" అన్నారు రిత్విక్ కుమార్. "త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ఆరంభిస్తాం" అని శశిధర్ నల్ల, విజయ్ కుమార్, సంతోష్ ఇమ్మడి, రామిశెట్టి రాంబాబు పేర్కొన్నారు. ఈ చిత్రానికి చంద్రబోస్ లిరిక్స్ అందిస్తుండగా, అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు.

## ఫస్ట్ టైం రవితేజకు జోడీగా ఆ స్టార్ హీరోయిన్

### అమ్మడి లక్ మాస్ రాజాకు కలిసొస్తుందా..!!

మాస్ మహారాజా రవితేజకు బ్యాడ్ లక్ వెంటాడుతుంది. వరుస గా సినిమాలు చేస్తున్నప్పటికీ అవి ప్రేక్షకులను మెప్పించలేకపోతున్నాయి. కొత్త కొత్త దర్శకులతో పని చేస్తున్నా కూడా ఒక్కటీ వర్కౌట్ కావడం లేదు.. అలాగే స్టార్ దర్శకులు కూడా రవితేజకు హిట్ ఇవ్వలేకపోయారు. మొన్నామధ్య హరీష్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన మిస్టర్ బచ్చన్ డిజాస్టర్ అయ్యింది. నిన్నటికి నిన్న మాసుజాతర అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చినా అది కూడా బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. దాంతో రవితేజ ఫ్యాన్స్ నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఒక్క సినిమా ఒకే ఒక్క సినిమా పడితే రవితేజ తిరిగి ఫామ్ లోకి వస్తారని ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం రవితేజ మరో కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు.

భర్తమహాశయులకు విజ్ఞప్తి అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు కిషోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇటీవలే ఓ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో ఆషిక రంగనాథ్, డింపుల్ హయతి హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఇదిలా ఉంటే ఇప్పుడు మాస్ రాజా మరో సినిమాను లైనప్ చేశాడని తెలుస్తుంది. శివ నిర్వాణ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడని తెలుస్తుంది. ఇక ఈ సినిమాలో ఓ స్టార్ హీరోయిన్‌ను సెలక్ట్ చేశారని తెలుస్తుంది. ఇంతకూ ఆ హీరోయిన్ ఎవరో తెలుసా..? ఆమె ఎవరో కాదు స్టార్ హీరోయిన్ సమంత. గతంలో శివ నిర్వాణ దర్శకత్వంలో సమంత రెండు సినిమాలు చేసింది. ఒకటి నాగచైతన్య హీరోగా నటించిన మజిలీ. అలాగే విజయ్ దేవరకొండ హీరోగా నటించిన ఖుషి సినిమా. ఇక ఇప్పుడు మరోసారి శివ నిర్వాణ దర్శకత్వంలో సమంత నటిస్తుందని అంటున్నారు. ఈసారి రవితేజకు జోడీగా సామ్ నటిస్తుంది. మొదటిసారి సమంత రవితేజ కలిసి నటిస్తున్నారు. మరి సమంత అయినా రవితేజకు హిట్ ఇస్తుందేమో చూడాలి.






## పవర్‌ఫుల్ క్వీన్‌గా నయనతార!

లేడీ సూపర్‌స్టార్ నయనతార టాలీవుడ్‌లో మళ్లీ బిజీ అయింది. కొన్నాళ్ల పాటు తెలుగు తెరపై అంతగా కనిపించని నయన్..ఇప్పుడు వరుస సినిమాలతో దూసుకెళ్తుంది. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి సరసన 'మన శంకర్ వరప్రసాద్ గారు' చిత్రంలో నటిస్తోంది. దీంతో పాటు సీనియర్ హీరో నందమూరి బాలకృష్ణ కొత్త సినిమాలోనూ నయన్ హీరోయిన్‌గా నటించబోతోంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలయ్య ఓ సినిమా చేయబోతున్న సంగతి తెలిసిందే. ఇందులో బాలయ్యకు జోడీగా నయనతార నటించబోతున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. నేడు(నవంబర్ 18) నయనతార బర్త్‌డే. ఈ సందర్భంగా ఓ స్పెషల్ వీడియోని రిలీజ్ చేశారు మేకర్స్. ఇందులో నయనతార పవర్‌ఫుల్ మహారాణి పాత్రలో కనిపించబోతున్నట్లు నిర్మాణ సంస్థ వెల్లడించింది. 'సముద్రమంత ప్రశాంతతను, తుపాను అంత బీభత్సాన్ని తనలో మోసే రాణి మా సామ్రాజ్యంలోకి అడుగుపెట్టనుంది' అంటూ వీడియోతో ద్వారా చిత్ర యూనిట్ నయనతారకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. కాగా, బాలయ్యతో నయనతార ఇప్పటికే మూడు సినిమాల్లో నటించింది. తొలుత సింహా చిత్రంలో వీరిద్దరు కలిసి నటించారు. ఆ తర్వాత 'జై సింహా', 'శ్రీరామరాజ్యం' చిత్రాల్లోనూ ఈ హిట్ జోడీ రిపీట్ అయింది. ఇప్పుడు నాలుగోసారి వెండితెరపై ఈ జంట అలరించబోతుంది. గతంలో మలినేని గోపిచంద్, బాలయ్య కాంబోలో వచ్చిన 'వీరసింహారెడ్డి' సూపర్ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి ఈ కాంబో రిపీట్ కావడంతో ఈ చిత్రంపై ఆసక్తి నెలకొంది.



## ఒకే ఫ్రేమ్‌లో రుద్ర, మందాకిని, కుంభ.. ట్రెండింగ్‌లో వారణాసి యాక్టర్ల సెల్ఫీ

తెలుగు ప్రేక్షకులతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న మూవీ లవర్స్ ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్ వారణాసి ఎస్ఎస్ రాజమౌళి డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మహేశ్ బాబు లీడ్ రోల్‌లో, బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. ఈ ముగ్గురూ పలు అంతర్జాతీయ మీడియా సంస్థలతో చిట్‌చాట్ చేశారని తెలిసిందే. ఓ ఇంటర్వ్యూ పూర్తయిన తర్వాత ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్, మహేశ్ బాబు సెల్ఫీ దిగారు. ఇందులో ప్రియాంకా చోప్రా మందాకిని పాత్రలో కనిపించనుంది. మహేశ్ బాబు రుద్రగా కనిపించనుండగా.. పృథ్వీరాజ్ సుకుమారన్ కుంభ రోల్‌లో నటిస్తున్నాడు. ప్రపంచమంతా చుట్టేయబోతున్న కథలోని ముఖాలు.. ముగ్గురి కలయికలో డిఫరెంట్ హిట్ ఉండబోతుందనే క్యాప్షన్‌తో మహేశ్ బాబు టీం పోస్ట్ చేసిన ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్‌లో లాంచ్ చేసిన టైటిల్ గ్లింప్స్‌లో మహేశ్ బాబు త్రిశూలాన్ని చేతపట్టుకుని ఎద్దు (నంది)పై స్వారీ చేస్తున్న విజువల్స్ నెట్టింటిని షేక్ చేస్తున్నాయి. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఈ మూవీని 2027, 2029లలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్టు వార్తలు వస్తుండగా జక్కన్న టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

## బ్లాక్ బస్టర్ సినిమాలన్నీ వదులుకుంది.. ఇప్పుడు హిట్స్ లేక సతమతం



సినిమా ఇండస్ట్రీలో హిట్స్, ఫ్లాప్స్ అనేవి చాలా కామన్. హీరోలు, హీరోయిన్స్ చాలా మంది హిట్స్, ఫ్లాప్స్ తో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నారు. కొంతమంది మాత్రం ఫ్లాప్స్ వస్తే కనిపించకుండా పోతారు. ముఖ్యంగా హీరోయిన్స్.. సినిమాలు ఫ్లాప్ అయితే చాలు ఐరెన్ లెగ్ అని ట్యాగ్ వేసేస్తారు. సినిమా అవకాశాలు కూడా తగ్గిపోతాయి.. క్రమంగా ఇండస్ట్రీలో కనిపించకుండాపోతారు.. కానీ ఈ హీరోయిన్ రూటే సపరేట్.. 20ఏళ్లుగా ఒక్క హిట్ అందుకోలేకపోయింది.. ఇరవై ఏళ్లకు పైగా సినీ ఇండస్ట్రీలో ఉంది ఈ ముద్దుగుమ్మ. అలాగే ఇరవై ఏళ్లుగా హిట్స్ మాత్రం అందుకోలేకపోయింది. కానీ ఆమె క్రేజ్ మాత్రం ఎక్కడ తగ్గలేదు. అందంలో అప్సరస.. గ్లామర్ డోస్ కూడా ఎక్కువే.. కానీ అదృష్టం మాత్రం దక్కలేదు ఈ చిన్నదానికి.. ఇంతకూ ఆమె ఎవరంటే..! బాలీవుడ్ ముద్దుగుమ్మ చిత్రాంగదా సింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చిత్రాంగదా రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో జన్మించి, అక్కడే పెరిగింది. బాలీవుడ్ సినిమాలతో పాపులర్ అయ్యింది. 2005లో హజారోన్ ఖ్వైషీన్ ఐసీ అనే క్రైమ్ డ్రామాతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. మోడలింగ్ నుంచి హీరోయిన్ గా మారింది ఈ చిన్నది. హీరోయిన్ గానే కాదు నిర్మాతగానూ చేసింది. 2018లో సూర్మా అనే స్పోర్ట్స్ డ్రామాకు నిర్మాతగా వ్యవహరించింది. ఇటీవలే హౌస్‌ఫుల్ 5 సినిమాలోనూ కనిపించింది ఈ ముద్దుగుమ్మ. సినీ కెరీర్ లో చిత్రాంగదా సింగ్ తొమ్మిదేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉంది. ఆ సమయంలో ఎన్నో బ్లాక్ బస్టర్ హిట్స్ మిస్ చేసుకుంది. అలాగే గతంలో ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఆసక్తికర కామెంట్స్ చేసింది. కెరీర్ లో నేను ఎన్నో తప్పులు చేశాను. నేను ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలను మిస్ చేసుకున్నా.. గ్యాంగ్‌స్టర్ సినిమా నేను రిజెక్ట్ చేశా.. అంతే కాదు తను వెడ్స్ మను సినిమాను కూడా నేను మిస్ చేసుకున్నా.. మంగల్ పాండే'లో అమీషా పటేల్ చేసిన పాత్రను కూడా నేను రిజెక్ట్ చేశా.. అని తెలిపింది. సినిమాలు నిరాశపరిచినప్పటికీ ఆమె నటనకు ఎప్పుడూ మంచి మార్కులే పడ్డాయి. కానీ కమర్షియల్‌గా పెద్ద హిట్స్ లేకపోవడం ఆమె కెరీర్‌కు మైనస్‌గా మారింది. ఇప్పటికి కూడా ఈ ముద్దుగుమ్మ సినిమాల్లో అవకాశాలు అందుకుంటుంది.